


# మన దునియా

RNI Number
TELTEL/2023/85680

Our News Our World

మన అక్షరం - మన ప్రపంచం



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

మన దునియా

సంప్రదించుటకు ...
9490056011,9603969335



సంపుటి : 3 | సంచిక : 242 | ఏప్రిల్ 29 బుధవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# కమలాపురంలో కల్తీ దందా..?

## చీకటి వ్యాపారానికి అధికారుల అండనా...?

## బెల్ట్ దందా జోరుగా... చర్యలు శూన్యం!





- లైసెన్స్ షాపుల నుంచే మళ్లింపా?
- కల్తీ మద్యం భయం... ప్రజల్లో ఆందోళన
- పర్యవేక్షణ ఎక్కడ?
- మామూళ్ల మత్తులో అధికారులు ఉన్నారా?
- దాడులు ప్రదర్శనలకే పరిమితమా?





**ప్రత్యేక కథనం**

మన దునియా,హనుమకొండ జిల్లా,కమలాపురం:ఏప్రిల్ 28

కమలాపురంలో కల్తీ మద్యం దందా మళ్లీ పుంజుకుంటోందన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ పరిసరాల వరకూ అనధికారికంగా మద్యం విక్రయాలు విస్తరిస్తున్నాయనే సమాచారం స్థానికంగా కలకలం రేపుతోంది.ప్రత్యేకంగా "బెల్ట్ దందా" పేరుతో ఇళ్ల వద్ద, చిన్న షాపుల వెనుక భాగాల్లో రహస్యంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారిక అనుమతులు లేకుండా సాగుతున్న ఈ వ్యవహారం నియంత్రణలో లేకుండా పోతుందనే భావన ప్రజల్లో బలపడుతోంది.

**లైసెన్స్ షాపుల నుంచే మళ్లింపా?**

స్థానికుల సమాచారం ప్రకారం, లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల నుంచి సరఫరా అయ్యే మద్యం బయటకు మళ్లించి, అధిక ధరలకు విక్రయిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నియమాలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ అక్రమాలు అధికారుల పర్యవేక్షణలో లోపాలను బహిర్గతం చేస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**కల్తీ మద్యం భయంఢ ప్రజల్లో ఆందోళన**

మరింత ఆందోళన కలిగిస్తున్న అంశంనాణ్యతలేని కల్తీ మద్యం విక్రయం. ఆరోగ్యానికి హానికరమైన పదార్థాలతో తయారయ్యే మద్యం ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పర్యవేక్షణ ఎక్కడ?**

ఇంత పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నప్పటికీ, సంబంధిత శాఖల స్పందనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్సైజ్ అధికారుల తనిఖీలు కేవలం

(మిగతా 2వ పేజీలో..)

## ఇరాన్ పతనం అంచున ఉంది.. వాళ్లే మాకు చెప్పారు: ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్య

### హర్మూజ్ దిగ్బంధనాన్ని ముగించాలని ఇరాన్ కోరిందన్న ట్రంప్

### ఇరాన్ తమ నాయకత్వాన్ని చక్కదిద్దుకునే పనిలో ఉందని వ్యాఖ్య

### అంతర్గత విభేదాలను వారు పరిష్కరించుకోవాలని సూచన

ఇరాన్ పతనం అంచున ఉందని, ఈ విషయాన్ని స్వయంగా ఆ దేశ ప్రతినిధులే తమకు చెప్పారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. వీలైనంత త్వరగా హర్మూజ్ జలసంధిని కూడా తెరవాలని వారు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. హర్మూజ్ దిగ్బంధనాన్ని ముగించాలని వారు



## లొంగిపోయిన మావోయిస్టులకు ప్రత్యేక డ్రెస్సులు, ఉద్యోగాలు

2

### లొంగిపోయిన మావోలను ప్రధాన స్రవంతిలోకి!

### తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

### లొంగిపోయిన మావోలకు టూరిజం గైడ్స్ గా ఉద్యోగాలు

### కాసేపట్లో నియామకపత్రాలను అందించనున్న రేవంత్ రెడ్డి

సమాజానికి దూరంగా అడవుల్లో గడిపిన మాజీ మావోయిస్టులను ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.



## కాంగ్రెస్, ఎస్పీ, టీఎంసీ మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్నాయి: నరేంద్రమోదీ

### మహిళా రిజర్వేషన్ బిల్లుకు కట్టుబడి ఉన్నామన్న మోదీ

### పార్లమెంటులో ఈ బిల్లును ప్రవేశపెట్టడానికి ప్రయత్నించామని వెల్లడి

### కాంగ్రెస్, ఎస్పీ, తృణమూల్ వంటి నీచ రాజకీయం వల్ల చట్టం అమల్లోకి రాలేదని విమర్శ

2



## శుక్రాచార్యుడు ఫాంహౌస్ లో పడుకున్నాడు.. మారీచుడు, సుబాహుడు జనంలో తిరుగుతున్నారు: రేవంత్ రెడ్డి సెటైర్లు

### ఫ్యూచర్ సిటీలో సీపీ భవనానికి సీఎం రేవంత్ శంకుస్థాపన

### ప్రపంచస్థాయి నగరంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తామని హామీ

### రైతులు భూములిచ్చి సహకరించాలని విజ్ఞప్తి

### ప్రతిపక్షాల మాటలు పట్టించుకోనని వ్యాఖ్య

ప్రజలను భాగస్వాములను చేస్తూ ఫ్యూచర్ సిటీని అధునాతన నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందరూ కలిసి పనిచేస్తేనే సిటీ నిర్మాణం సాధ్యమవుతుందని సీపీ భవన శంకుస్థాపన కార్యక్రమంలో స్పష్టం చేశారు. ఈ నగరం భావితరాలకు వరంగా మారుతుందని పేర్కొన్నారు. అయితే, ఫ్యూచర్ సిటీ నిర్మాణం అంత సులభం కాదని వివరించారు. ఈ సందర్భంగా విపక్ష నేతలపై తనదైన శైలిలో సెటైర్లు వేశారు.కొంత మంది ఫ్యూచర్ సిటీ నిర్మాణం విషయంలో తనను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని రేవంత్ అన్నారు. "మీరు ఏడుస్తూనే ఉండండి.. నేను చేసుకుంటూ పోతూనే ఉంటా" అంటూ తనదైన శైలిలో ప్రతిపక్షాలకు చురకలు అంటించారు. శుక్రాచార్యుడు ఫాంహౌస్ లో పడుకున్నాడని, మారీచుడు, సుబాహుడు జనంలో తిరుగుతున్నారంటూ బీఆర్ఎస్ అగ్రనేతలను ఉద్దేశించి అన్నారు.టోక్యో, సియోల్, సింగపూర్ వంటి ప్రపంచ స్థాయి నగరాలతో



(మిగతా 2వ పేజీలో..)

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం



# కమలాపురంలో కల్తీ దందా ?

(మొదటి పేజీ తరువాయి)



కాగితాలకే పరిమితమయ్యాయా? లేక ఉద్దేశపూర్వకంగా కనుగుడ్లు మూస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. "మామూళ్ల మత్తులో అధికారులు ఉన్నారా?"అనే ఆరోపణలు కూడా వినిపించడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది.

**దాడులు ప్రదర్శనలకే పరిమితమా?**

అప్పుడప్పుడు జరుగుతున్న దాడులు కూడా కేవలం చూపు కోసం మాత్రమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. బహిరంగంగానే విక్రయాలు జరుగుతున్న ప్రాంతాల్లో కూడా చర్యలు లేకపోవడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది

# లొంగిపోయిన మావోయిస్టులకు ప్రత్యేక డ్రెస్సులు, ఉద్యోగాలు

(మొదటి పేజీ తరువాయి)

లొంగిపోయిన 20 మంది మాజీ మావోయిస్టులకు టూరిజం గైడ్స్ గా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది.ముఖ్యంగా భద్రాచలం, ములుగు వంటి అటవీ ప్రాంతాల్లోని భౌగోళిక పరిస్థితులపై వారికి ఉన్న పట్టును ప్రభుత్వం నిర్మాణాత్మకంగా వాడుకోవాలని నిర్ణయించింది. అడవి మార్గాలు, అక్కడి విశేషాల గురించి వారికి ఉన్న లోతైన అవగాహన పర్యాటకులకు ఎంతో మేలు చేస్తుంది. ఈ ఉద్యోగాల కోసం వీరికి స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ), పర్యాటక శాఖ సంయుక్తంగా నెల రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వీరికి ప్రత్యేక యూనిఫామ్ కూడా కేటాయించనున్నారు. పునరావాసం అంటే కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాకుండా, ఇలా వారి నైపుణ్యానికి తగిన గౌరవప్రదమైన ఉపాధిని కల్పించడం అనేది ఇతర మావోయిస్టులను కూడా ప్రభావితం చేసే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి కాసేపట్లో వీరికి నియామకపత్రాలను అందించనున్నారు.

# ఇరాన్ పతనం అంచున ఉంది.. వాళ్లే మాకు చెప్పారు: ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్య

(మొదటి పేజీ తరువాయి)

తమను కోరారని 'ట్రూత్' సోషల్ మీడియా వేదికగా ఆయన పోస్టు పెట్టారు.ఇరాన్ తమ నాయకత్వాన్ని చక్కదిద్దుకునే పనిలో ఉందని ఆసక్తికర వ్యాఖ్య చేశారు. సుదీర్ఘ యుద్ధం కొనసాగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో, తమ దేశ ప్రతినిధులతో చర్చల విషయంలో ఇరాన్ ప్రభుత్వంలో ఉన్న అంతర్గత విభేదాలను వాళ్లు పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.అయితే ఇరాన్ నుంచి ఎవరి ద్వారా తనకు ఈ సమాచారం అందిందనే విషయాన్ని ఆయన వెల్లడించలేదు. అలాగే ఈ సంభాషణ నేరుగా జరిగిందా లేక మధ్యవర్తి ద్వారా తెలిసిందా? రిపబ్లికన్ ప్రభుత్వంలో ఎవరికి ఈ సమాచారం అందింది? అనే ప్రశ్నలపై కూడా వైట్ హౌస్ స్పందించలేదు.

# యూఏఈ కీలక నిర్ణయం... ఒపెక్ గ్రూపు నుంచి బయటకు...!

**ఒపెక్, ఒపెక్ ప్లస్ గ్రూపుల నుంచి బయటకొచ్చిన యూఏఈ**

**మే 1వ తేదీ నుంచి అమల్లోకి నిర్ణయం**

**దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి**



యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ (యూఏఈ) కీలక నిర్ణయం తీసుకుంది. ఒపెక్, ఒపెక్ ప్లస్ దేశాల కూటమి నుంచి బయటకు వచ్చింది. మే 1వ తేదీ నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని యూఏఈ తెలిపింది. చమురు ఎగుమతి దేశాల కూటమికి, దానికి నాయకత్వం వహిస్తున్న సౌదీ అరేబియాకు ఇది పెద్ద దెబ్బగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఆర్గనైజేషన్ ఆఫ్ ది పెట్రోలియం ఎక్స్‌పోర్టింగ్ కంట్రీస్ (ఒపెక్)లో చాలా ఏళ్లుగా యూఏఈ సభ్యదేశంగా ఉంది. ఒపెక్ ఏర్పాటైన ఏడేళ్ల తర్వాత 1967లో యూఏఈ ఇందులో చేరింది. సౌదీ అరేబియా, ఇరాక్ తర్వాత మూడో అతిపెద్ద చమురు ఎగుమతిదారుగా ఉంది. ఒపెక్ నిర్ణయాల్లో కీలకంగా వ్యవహరిస్తూ వస్తోంది. సుదీర్ఘకాలం పాటు సభ్యదేశంగా కొనసాగిన యూఏఈ అనూహ్యంగా ఈ నిర్ణయం తీసుకుంది. అయితే కూటమి నుంచి బయటకు రావడానికి గల కారణాలు తెలియరాలేదు. అయితే తమ దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో, ఉత్పత్తి పెంపు విషయంలో తలెత్తిన అంతర్గత విబేధాల నేపథ్యంలో యూఏఈ ఈ నిర్ణయం తీసుకున్నదని తెలుస్తోంది. ఇరాన్ దాడుల విషయంలో సౌదీ అరేబియా, ప్రాంతీయ మిత్ర దేశాలు సరైన విధంగా స్పందించకపోవడం వల్ల యూఏఈ ఇప్పటికే అసంతృప్తితో ఉంది.

# శుక్రాచార్యుడు ఫాంహౌస్ లో పడుకున్నాడు.. మారీచుడు, సుబాహుడు జనంలో తిరుగుతున్నారు: రేవంత్ రెడ్డి సెటైర్లు

(మొదటి పేజీ తరువాయి)

పోటీ పడేలా ఫ్యూచర్ సిటీని నిర్మించడమే తమ లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ దిశగా రోడ్లు సహా అన్ని మౌలిక సదుపాయాలను వేగంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా జూన్ 2లోపు ఫ్యూచర్ సిటీ భవన నిర్మాణాన్ని పూర్తిచేస్తామని తెలిపారు.హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు రాష్ట్రానికే తలమానికం అని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. కోవిడ్ వ్యాక్సిన్ తయారీలో హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ సేవలు ప్రపంచవ్యాప్తంగా అందాయని తెలిపారు. ఐటీ, డిఫెన్స్, ఫార్మా ఎగుమతుల్లో నగరం చాలా అభివృద్ధి చెందిందన్నారు. రానున్న రోజుల్లో భాగ్యనగరానికి మరిన్ని పెట్టుబడులు రానున్నాయని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ కోసం రైతులు భూములిచ్చి సహకరించాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు. అందరికీ కచ్చితంగా పరిహారం అందిస్తామన్నారు. అధికారులు వారికి వివరించి నచ్చజెప్పాలన్నారు. అప్పుడే ప్రపంచస్థాయి నగరానికి పునాదులు పడతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పూర్తయితే హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 70-80 కి.మీ దూరం తగ్గుతుందన్నారు. కేంద్రం తీసుకురానున్న ఏడు హైస్పీడ్ రైళ్లలో మూడు రాష్ట్రం నుంచి వెళుతున్నాయని సీఎం తెలిపారు. బెంగళూరు నుంచి హైదరాబాద్, శంషాబాద్ నుంచి ముంబై, శంషాబాద్ నుంచి చెన్నై వరకు బుల్లెట్ ట్రైన్లు రాబోతున్నాయని పేర్కొన్నారు.

# కాంగ్రెస్, ఎస్పీ, టీఎంసీ మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్నాయి: నరేంద్రమోదీ

(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదాన్ని అడ్డుకున్నారని కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే వంటి ప్రతిపక్ష పార్టీలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ అమలుకు కట్టుబడి ఉన్నామని ఆయన పునరుద్ఘాటించారు. పార్లమెంటులో ఈ బిల్లును ప్రవేశపెట్టడానికి తాము ఎంతగానో ప్రయత్నించామని తెలిపారు.కాంగ్రెస్, ఎస్పీ, తృణమూల్ వంటి ప్రతిపక్ష పార్టీల నీచ రాజకీయం వల్లే ఆ చట్టం అమల్లోకి రాకుండా ఆగిపోయిందని విమర్శించారు. మహిళలు అభివృద్ధి చెందడం, అసెంబ్లీ, పార్లమెంటులకు రావడం ప్రతిపక్షాలకు ఇష్టంలేదని వ్యాఖ్యానించారు. అందుకే నాలుగు దశాబ్దాలుగా ఈ బిల్లును అడ్డుకున్నారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడమే కాకుండా, తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని మండిపడ్డారు.లోక్ సభ, శాసనసభలలో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయడమనే మహాయజ్ఞం ప్రారంభించడానికి సిద్ధమవుతున్నామని ఆయన అన్నారు. మాతృమూర్తుల ఆశీస్సులు తీసుకురావడానికి చేస్తున్న ప్రయత్నాల్లో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని అన్నారు. ఇది రాజకీయ పార్టీల కోసం తెచ్చింది కాదని, సాధారణ మహిళలు పార్లమెంటుకు, అసెంబ్లీకి రావడానికి తెచ్చిందని అన్నారు. కానీ ప్రతిపక్షాలు మాత్రం మహిళలు కేవలం కుటుంబాలకే పరిమితం కావాలని కోరుకుంటున్నాయని ఆరోపించారు.

# ఒకసారి చేతులు కలిపితే పూర్తి బాధ్యత మాదే: మంత్రి నారా లోకేష్

**విశాఖలో గూగుల్ ఆధ్వర్యంలో భారత్ ఏఐ శక్తి కాంక్లేవ్**

**దేశ డిజిటల్ ప్రయాణంలో ఇది కొత్త అధ్యాయం అన్న మంత్రి లోకేష్**

**15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏఐ హబ్.. 2 లక్షల ఉద్యోగాల అంచనా**

**2047 నాటికి విశాఖను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం**

**పదేళ్లలోనే విశాఖలో హైదరాబాద్ స్థాయి అభివృద్ధి సాధిస్తామని ధీమా**

విశాఖపట్నం కేంద్రంగా భారతదేశ డిజిటల్ ప్రగతిలో ఒక సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టామని, ఇది కేవలం గూగుల్ ఏఐ డేటా సెంటర్ ప్రారంభం మాత్రమే కాదని, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు కీలకమైన మలుపు అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. గూగుల్ ఆధ్వర్యంలో విశాఖ నోవాటెల్ హోటల్‌లో మంగళవారం జరిగిన 'భారత్ ఏఐ శక్తి కాంక్లేవ్'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా, విశాఖ అభివృద్ధిపై ప్రజా ప్రభుత్వ దార్శనికతను, లక్ష్యాలను ఆయన స్పష్టంగా వివరించారు.పెట్టుబడుల విషయంలో ఎంవోయూలపై కాకుండా, షేక్ హ్యాండ్‌లపై నమ్మకం ఉంచుతామని, ఒకసారి చేతులు కలిపితే ఆ ప్రాజెక్టును తమదిగా భావించి పూర్తి బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని, పారిశ్రామికవేత్తలు పెద్దఎత్తున ఏపీ, విశాఖలో పెట్టుబడులు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గూగుల్ క్లౌడ్ గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వైస్ ప్రెసిడెంట్ బికాష్ కోలేతో పాటు 49 కంపెనీల ప్రతినిధులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు."దశాబ్దాలుగా దేశ ఖనిజ సంపదను ప్రపంచానికి అందించిన విశాఖ నగరం.. ఉక్కు పునాదులపై నిర్మితమైంది. కానీ నేడు, ఈ ఉక్కు నగర పునాదులను కృత్రిమ మేధ (ఏఐ) విప్లవంపై నిర్మించబోతున్నాం. మన దేశ భవిష్యత్తును వైజాగ్ నిర్మించబోతోందని నేను బలంగా విశ్వసిస్తున్నాను" అని లోకేష్ పేర్కొన్నారు. ప్రపంచం భారీ పరిశ్రమల నుంచి డిజిటల్ మౌలిక సదుపాయాల వైపు, తయారీ నుంచి మెషిన్ ఇంటెలిజెన్స్ వైపు వేగంగా మారుతోందని, ఈ మార్పులో విశాఖ కీలక పాత్ర పోషించనుందని తెలిపారు.

**15 బిలియన్ డాలర్ల పెట్టుబడి.. 2 లక్షల ఉద్యోగాలు**


గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటు చరిత్రాత్మకమని మంత్రి అభివర్ణించారు. దేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అయిన 15 బిలియన్ డాలర్లతో పాటు, ఒక గిగా వాట్ సామర్థ్యం గల డేటా సెంటర్ ఎకోసిస్టమ్ ఇక్కడ రూపుదిద్దుకోనుందని తెలిపారు. తొలిసారిగా విశాఖలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు ఏర్పాటు కానున్నాయని, కనెక్టివిటీ విషయంలో ఇతర రాష్ట్రాలతో దీటుగా పోటీ పడతామని చెప్పారు. "ఒకప్పుడు ఓడరేవులు ఈ నగరాన్ని ప్రపంచంతో భౌతికంగా కలిపితే, ఇప్పుడు ఈ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు డిజిటల్‌గా అనుసంధానిస్తాయి. ఈ పెట్టుబడి వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2 లక్షల ఉద్యోగాలు వస్తాయి. ఇది కేవలం ఒక ప్రాజెక్ట్ కాదు, ఆర్థికాభివృద్ధికి ఒక మల్టిప్లయర్," అని లోకేష్ వివరించారు.

**2047 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా విశాఖ**

2047 నాటికి విశాఖ ఎకనమిక్ రీజియన్‌ను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని లోకేష్ స్పష్టం చేశారు. ఇటీవల ఆర్సెలార్ మిట్టల్‌తో కలిసి గ్రీన్ స్టీల్ సిటీకి శంకుస్థాపన చేశామని, అదేవిధంగా ఏఐ, డేటా, ఫార్మా, మెడికల్ డివైసెస్ రంగాల్లో భారీ అభివృద్ధి జరగనుందని తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధిని ఉదాహరణగా చూపుతూ, "ఒకప్పుడు సైబర్ టవర్స్ నిర్మాణానికి చంద్రబాబు గారు సంకల్పించినప్పుడు అందరూ ఎగతాళి చేశారు. కానీ, స్పష్టమైన విజన్‌తో అది సాధ్యమైంది. హైదరాబాద్‌లో 30 ఏళ్లలో సాధించిన అభివృద్ధిని, విశాఖలో రాబోయే 10 ఏళ్లలోనే సాధించి చూపిస్తాం," అని ధీమా వ్యక్తం చేశారు.

**అదే మమ్మల్ని ముందుకు నడిపిస్తోంది**

ఆంధ్రప్రదేశ్ నూతన రాష్ట్రమని, అందుకే తమలో అభివృద్ధి పట్ల కసి, పట్టుదల ఎక్కువగా ఉన్నాయని మంత్రి అన్నారు. "చరిత్రలో నాలుగుసార్లు రాష్ట్రాన్ని పునర్నిర్మించుకోవాల్సిన అవసరం మాకు పడింది. మొదట మద్రాసులో, తర్వాత కర్నూలు రాజధానిగా, ఆ తర్వాత హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుని విడిపోయాం. ఈ అనుభవమే మమ్మల్ని ముందుకు నడిపిస్తోంది. మమ్మల్ని ఒక స్టార్టప్‌లా చూడండి" అని పారిశ్రామికవేత్తలను కోరారు. మా కేబినెట్‌లో 25 మంది మంత్రుల్లో 17 మంది, శాసనసభ్యుల్లో సగం మంది కొత్తవారేనని, అందరం ఉత్సాహంతో పనిచేస్తున్నామని చెప్పారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# రైతన్నలకు అలర్ట్.. నెల రోజులే గడువు..
# ఆ ఐడీ ఉంటేనే పథకాలు వర్తింపు!

**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 28**

ఆధార్ కార్డు మాదిరిగానే ప్రతి రైతుకు 11 అంకెలతో కూడిన ఒక విశిష్ట సంఖ్యను కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది.ఇందుకోసం 'ఫార్మర్ రిజిస్ట్రీ'ని అందుబాటులోకి తీసుకువచ్చింది. భూమి ఉన్న ప్రతి రైతు తన భూయాజమాన్య వివరాలను తన గుర్తింపు కార్డుతో అనుసంధానం చేయడం ద్వారా ఈ ఐడీని పొందవచ్చు. 2026-27 ఆర్థిక సంవత్సరం నుండి కేంద్ర ప్రభుత్వం అమలు చేసే కిసాన్ సమ్మాన్ నిధి, ఫసల్ బీమా యోజన, విత్తన, యంత్ర పరికరాల సబ్సిడీ వంటి అన్ని రకాల సంక్షేమ పథకాలు అందాలంటే ఈ యూనిక్ ఐడీ తప్పనిసరి.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. రాష్ట్రంలోని 32 జిల్లాల్లో ఉన్న మొత్తం 73.82 లక్షల మంది రైతుల్లో, ఇప్పటివరకు 48.97 లక్షల మంది (సుమారు 66.34 శాతం) రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నారు. ఈ ప్రక్రియలో 79.54 శాతంతో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవగా, ఖమ్మం జిల్లా రెండో స్థానంలో ఉంది. అయితే, మేడ్చల్ (46.37 శాతం), రంగారెడ్డి (51.60 శాతం) జిల్లాలు ఈ జాబితాలో చివరి స్థానాల్లో నిలిచాయి. ఆదాయపు పన్ను చెల్లించే ఉద్యోగులు మరియు అవగాహన లేని కొందరు చిన్న రైతులు ఈ రిజిస్ట్రేషన్‌పై ఆసక్తి చూపకపోవడమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.భవిష్యత్తులో




ఎరువుల కొనుగోలు, పంటల అమ్మకాలు మరియు ఇతర ప్రభుత్వ ప్రయోజనాల కోసం కూడా ఈ ఐడీని ప్రామాణికంగా తీసుకునే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవడానికి కేవలం నెల రోజులే గడువు ఉన్నందున, రైతులందరూ మీ-సేవ కేంద్రాల ద్వారా లేదా సంబంధిత అధికారుల సహాయంతో త్వరగా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వ పథకాలకు దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# టీచర్ల ప్రమోషన్లకు విద్యాశాఖ కసరత్తు!

**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 28**

ఎన్నో ఏండ్లుగా పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయుల ప్రమోషన్లకు అతి త్వరలో లైన్ క్లియర్ కానుంది, తెలంగాణ రాష్ట్రంలో ఇన్- సర్వీస్ ఉపాధ్యాయుల ప్రమోషన్లకు ప్రధాన అడ్డంకిగా ఉన్న సమస్య లను తొలగించే దిశగా చర్యలకు పూనుకుంది. ఉపాధ్యాయులు ప్రమోషన్ కు అర్హత సాధించాలంటే.. తప్పకుండా ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్,క్వాలిఫై కావాలి. కానీ చాలా మంది టీచర్లు ఈ అర్హత సాధించ క పదోన్నతులకు దూరమ వుతున్నారు. ఈ క్రమంలో రేవంత్ రెడ్డి, సర్కార్ వారికి శుభవార్త చెప్పింది. ఈ ఏడాది డిసెంబర్ లోపు రెండు ప్రత్యేక టెట్ పరీక్షలను నిర్వహించాలని భావిస్తోన్న విద్యాశాఖ.. ఇప్పటికే దీనిపై ప్రభుత్వ అనుమతి కోరుతూ ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. గతంలో 2011 కంటే ముందు నియమితులైన టీచర్లకు టెట్ నుంచి మిన హాయింపు ఉంటుందని భావించారు. కానీ 2025 లో సుప్రీంకోర్టు వెలువరిం చిన తీర్పుతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దీని ప్రకారం.. పదోన్నతు లు పొందే ప్రతి ఉపాధ్యా యుడు.. టెట్ పాస్ కావ డం తప్పనిసరి చేసింది. ఈ క్రమంలో టెట్ క్వాలిఫై కాని టీచర్లు.. 31 మార్చి 2027 నాటికి టెట్ సాధించకపోతే పదోన్నతులకు అనర్హులు గా ఉంటారని నిబంధన విధించింది. ఈ నేపథ్యంలో నే తెలం గాణ విద్యాశాఖ రెండో టెట్ నిర్వహించా లని భావిస్తోంది.తెలంగాణ వ్యాప్తంగా ఇప్పుడు 1.02 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరిలో




సుమారు 57 వేల మంది టెట్ అర్హత సాధించలేదు. అయితే గతంలో వివిధ దశల్లో విద్యాశాఖ నిర్వహించిన టెట్ లో 30 వేల మంది టీచర్లు అర్హత సాధించారు. ఇంకా 27 వేల మంది టెట్ క్వాలిఫై కావాల్సి ఉంది. ప్రస్తుతం విడుదలైన టెట్ నోటిఫికేష న్ ద్వారా కొంతమంది గట్టె క్కే అవకాశం ఉన్నప్పటికీ, మిగిలిన వారందరికీ ఈ ఏడాది నిర్వహించే రెండు ప్రత్యేక టెట్ పరీక్షలు కీలకం కానున్నాయని చెప్పవచ్చు.

# పెట్రోల్ బంకుల్లో తాత్కాలిక ఇందన కొరత!

**మన దునియా,పెద్దపల్లి జిల్లా:ఏప్రిల్ 28**


గత కొన్ని రోజులుగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తం గా, పెట్రోల్, డీజిల్ సరఫరాకు సంబంధించి గందరగోళం నెలకొంది. ఇంధన నిల్వలు నిండుకుంటున్నాయనే వార్తల నేపథ్యంలో వాహనదారులు బంకుల వద్దకు క్యూ కడుతున్నారు. ఈ రద్దీని నియంత్రించడా నికి , అందుబాటులో ఉన్న నిల్వలను అందరికీ సమా నంగా పంపిణీ చేయ డాని కి పెట్రోల్ బంకుల యాజ మాన్యాలు కొన్ని కఠినమైన నిబంధనలను అమలు లోకి తీసుకువచ్చాయి.పెట్రోల్ బంకుల్లో ఇంధన లభ్యత తక్కువగా ఉండ టంతో, యాజమాన్యాలు వాహనాల రకాన్ని బట్టి రేషన్ పద్ధతిని అమలు చేస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు.. బైక్‌లు లేదా స్కూటర్లకు కేవలం రూ. 200 విలువైన పెట్రోల్‌ను మాత్రమే పోస్తున్నారు. నాలుగు చక్రాల వాహనాలకు గరిష్టంగా రూ. 1,000 వరకు మాత్రమే ఇంధనాన్ని నింపుతున్నారు. ప్లాస్టిక్ బాటిళ్లు, పెద్ద డబ్బాలు లేదా క్యాన్లలో పెట్రోల్ నింపడాన్ని పూర్తిగా నిషేధించారు. అత్యవసర పరిస్థితుల పేరుతో వచ్చే వారికి కూడా ఇంధనం నింపే ప్రసక్తే లేదని బంకు యజమానులు ఖరా ఖండిగా చెబుతున్నారు. మరోవైపు.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధికారు లు ఇంధన కొరతపై స్పంది స్తూ ప్రజలు ఆందోళన చెందవద్దని కోరుతున్నారు. రాష్ట్రంలో ఇంధన నిల్వలు సరిపడా ఉన్నాయని, ఇది కేవలం "కృత్రిమ కొరత మాత్రమేనని వారు పేర్కొంటున్నారు. పెట్రోల్ నిల్వలను దాచి పెట్టి, బ్లాక్ మార్కెట్‌లో విక్రయించే వారిపై లేదా కావాలనే కొరత సృష్టించే బంకు యజమానులపై కఠిన చర్యలు తీసుకుం టామని అధికారులు హెచ్చరిస్తున్నారు. అగ్ని ప్రమాదాల దృష్ట్యా దుర్వినియోగాన్ని అరికట్టడానికి బాటిళ్లలో పెట్రోల్ విక్రయించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు.సోషల్ మీడియా లో వస్తున్న పుకార్ల వల్ల వాహనదారులు ఒకేసారి బంకుల వద్దకు రావడంతో భయంతో కొనుగోలు చేయడం జరుగుతోంది. దీనివల్ల సాధారణంగా ఉండాల్సిన నిల్వలు కూడా వేగంగా ఖర్చయిపోతున్నా యి. అధికారులు సరఫరా ను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటున్నం దున, ప్రజలు సంయమనం పాటించాలని .. అవసరమై న మేరకే ఇంధనాన్ని నింపు కోవాలని సూచిస్తున్నారు. ప్రస్తుతానికి ఈ ఆంక్షలు తాత్కాలికమే అయినప్ప టికీ, పరిస్థితి చక్కబడే వరకు వాహనదారులు సహకరించడం అవసరం.



# వీధి కుక్కల రక్తంతో వ్యాపారం.
# వెలుగులోకి అమానుష దందా..!

**హైదరాబాద్‌లో వెలుగు చూసిన జంతువుల బ్లడ్ రాకెట్.**
**వీధి కుక్కలను బంధించి రక్తాన్ని అమ్ముతున్న ప్రైవేట్ ఆసుపత్రి.**

**మన దునియా,హైదరాబాద్,ఏప్రిల్ 28:**



ఒక్కో బ్లడ్ ప్యాకెట్‌కు రూ. 25 వేల వరకు అక్రమ వసూళ్ల. జంతు హక్కుల ఉద్యమకర్త మేనకా గాంధీ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన అధికారులు ఆసుపత్రి రికార్డులు స్వాధీనం, కొనసాగుతున్న విచారణ. మనుషుల అవయవాలు, రక్తంతో వ్యాపారం చేయడం గురించి విన్నాం. కానీ, ఇప్పుడు కొందరు అక్రమార్కులు మూగ జీవాలను కూడా వదలకుండా వాటి రక్తంతో అక్రమ దందాకు తెరలేపిన అమానుష ఘటన. హైదరాబాద్‌లో వెలుగు చూసింది. నగరంలోని షేక్‌పేటలో ఉన్న ఒక ప్రైవేట్ వెటర్నరీ ఆసుపత్రిలో వీధి కుక్కల రక్తాన్ని అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్న రాకెట్‌ను అధికారులు గుర్తించారు. ఈ దారుణంపై జంతు ప్రేమికులు జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేయడంతో పాటు, జంతు హక్కుల ఉద్యమకర్త మేనకా గాంధీ సైతం రాష్ట్ర జంతు సంక్షేమ సంస్థ దృష్టికి తీసుకెళ్లడంతో ఈ వ్యవహారం తీవ్రరూపం దాల్చింది.నగరంలో జంతువుల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ రక్త నిధి కేంద్రాలు లేక పోవడమే ఇలాంటి మాఫియాలు పుట్టుకు రావడానికి కారణమని అధికారులు భావిస్తున్నారు. ఫిర్యాదులు అందడంతో జీహెచ్ఎంసీ పశు వైద్యాధికారులు ఆసుపత్రిపై దాడులు చేసి, రికార్డులను, నిల్వ ఉంచిన రక్తపు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై లోతైన విచారణ కొనసాగుతోందని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని జంతు ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సర్వోదయ
# సంస్థ ప్రతినిధులు ధైర్యం చెప్పిన వాణి మేడం





**సంగెం 28 ( మన దునియా)**

ఈరోజు సంగెం మండలం గవిచర్ల గ్రామానికి విచ్చేసి మహబూబ్ పాషా నజీమా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేసిన సర్వోదయ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ సంగెం మండల కోఆర్డినేటర్ వనిత (వాణి )మేడం మరియు గ్రామ అంగన్వాడి కార్యకర్త భాషి పాక హేమలత సదయ్య సర్పంచ్ గారు ఇటివల ఈనెల ఆరో తేదీన మహబూబ్ పాష పెద్ద అబ్బాయి అశ్రుత్ అనారోగ్యంతో చనిపోయిన విషయం తెలుసుకొని హనుమకొండ నుండి మేడం గారు గవిచర్లకు వచ్చి మమ్ములను పలకరించి ధైర్యం చెప్పడం జరిగింది సర్వోదయ స్వచ్ఛంద సంస్థలో నేను మహబూబ్ పా షా కమిటీ మెంబర్ గా పనిచేస్తు నాను ప్రాజెక్టు మీటింగులు గ్రామంలోనిఅప్పుడప్పుడు మా అబ్బాయి హెల్త్ గురించి కూడా మేడం సార్ వాళ్లకు చెప్పేవాడిని ఇదివరకు మేడం సార్ వాళ్ళు మా అబ్బాయిని కూడా చూసినారు ఇంటికి వచ్చి మమ్ములను ఓదార్చి చాలా బాధపడినారు

# కొనిచ్చిన బైకునే తగలబెట్టిన తండ్రి.

**మన దునియా,విశాఖపట్నం వేపగుంట:ఏప్రిల్ 28 విశాఖపట్నం (వేపగుంట) :**



కుమారుడి కోరిక మేరకు ఆ తండ్రి బైక్ కొనిచ్చారు. దాన్ని ఆ కుమారుడు రోడ్డు నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తుండడంతో ట్రాఫిక్ చలానాలు వస్తున్నాయి. దీంతో విసిగిపోయిన తండ్రి.. చివరకు వాహనాన్ని తగలబెట్టారు. విశాఖలోని పెందుర్తి జరిగిన ఈ ఘటనపై పోలీసుల కథనం.. వేపగుంట సమీప బంటాకాలనీకి చెందిన ఓ వ్యక్తి ఆటో డ్రైవర్గా జీవనం సాగిస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు. వారిలో ఓ కుమారుడు కళాశాలకు వెళ్లొచ్చేందుకు బైక్ కావాలని పట్టుబట్టాడు. తప్పనిసరి పరిస్థితిలో తండ్రి ఏడాది కిందట వాహనం కొనుగోలు చేశారు. అది చేతికందిన తర్వాత ఆ అబ్బాయి తన స్నేహితులతో ఎక్కువగా తిరగడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిన నడిపాడు. గతేడాది ఓ ప్రమాదం జరగ్గా.. ఆసుపత్రి ఖర్చుల కోసం తండ్రి రూ. లక్ష వరకు ఖర్చు చేశారు. తాజాగా మరోమారు ట్రిపుల్ రైడింగ్ కారణంగా జరిమానా పడడంతో తండ్రి అసహనం చెందారు. బైకు కొనివ్వడం వల్లే తన కుమారుడు ఇలా తయారయ్యాడని ఆగ్రహించి కాలనీకి దూరంగా వాహనాన్ని తీసుకెళ్లి తగలబెట్టారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## రేపే పదవ తరగతి పరీక్షల ఫలితాలు!

**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 28**




తెలంగాణలోని లక్షలాది మంది విద్యార్థులు ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తు న్న పదో తరగతి పరీక్షా ఫలితాల విడుదలకు ముహూర్తం దాదాపు ఖరారైంది. రేపు బుధవారం మధ్యాహ్నం ఈ ఫలితా లను వెల్లడించేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారులు సర్వం సిద్ధం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మార్చి 14న ప్రారంభమైన పదో తరగతి ప్రధాన పరీక్షలు.. ఈ నెల 13వ తేదీతో విజయవంతంగా ముగిశాయి. సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు.పరీక్షలు ముగిసిన వెంటనే విద్యా శాఖ యుద్ధప్రాతిపదికన మూల్యాంకన ప్రక్రియను చేపట్టింది. ఈ నెల 23వ తేదీ నాటికే జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి కావడంతో.. ఫలితాలను అనుకున్న సమయం కంటే ముందే విడుదల చేయాలని అధి కారులు నిర్ణయించారు. వాస్తవానికి మే మొదటి వారంలో ఫలితాలు విడుదల చేయాలని భావించినప్పటికీ, విద్యా ర్థులపై ఒత్తిడి తగ్గించేందు కు, పై చదువుల ప్రవేశాల కు వీలుగా ఈ నెల 29నే ఫలితాలను విడుదల చేసేందుకు రంగం సిద్ధ మైంది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుండి కూడా సానుకూల స్పందన లభించినట్లు సమాచారం.ఈ ఏడాది ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వ సలహాదా రు కె.కేశవరావు అధికారి కంగా విడుదల చేయను న్నారు. ఇప్పటికే మార్కుల నమోదు, సాంకేతిక తనిఖీ లు పూర్తి కావచ్చాయని, విద్యార్థులు తమ ఫలితా లను అధికారిక వెబ్‌సైట్లలో చూసుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని విద్యాశాఖ తెలిపింది.

## మండల కేంద్రాలలో "నేతకానిల నిరసన ర్యాలీ" కార్యక్రమాన్ని విజయవంతం చేయండి !

**రత్నం లక్ష్మణ్**
**(నేతకానికుల సంఘం మండల అధ్యక్షులు.)**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా:ఏప్రిల్ 28,**



ఇటీవల ఏదైతే రాష్ట్ర ప్రభుత్వం కులాల వారీగా జనాభాను పొందుపరుస్తూ విడుదల చేసిన జనాభా గణాంకాలలో ఏ కులానికి రానిసమస్య మన కులానికి వచ్చిందని గ్రహించి రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ చేపట్టిన ఉద్యమంలో భాగంగా అన్ని మండల కేంద్రాలలో నేతకాని కులస్తులుగా మన ఐక్యతను చాటుతూ శాంతియుత నిరసన ర్యాలీలు చేపట్టి మండల కేంద్రాలకు అధికారులైన స్థానిక ఎం ఆర్ ఓ కి వినతి పత్రాలు అందించే కార్యక్రమాన్ని నిర్వహించాలని పిలుపునివ్వగా ... దానిలోభాగంగా తేదీ 30/4/2026 గురువారం రోజున ఉదయం 9:30 నిమిషాలకు జన్నారం మండల కేంద్రంలో స్థానిక తెలంగాణతల్లి విగ్రహం నుండి మొదలుకొని ఎం ఆర్ ఓ కార్యాలయం వరకు నేతకానిల నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రసాద్ నేత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాలలో నుండి నేతకాని కులబాంధవులు పెద్దఎత్తున తరలిరావాలని, ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## తెలంగాణకు కొత్త డీజీపీగా సి.వి.ఆనంద్ నియామకం..!

**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 28**

తెలంగాణ రాష్ట్రానికి కొత్త డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా సి.వి. ఆనంద్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం డీజీపీగా కొనసాగుతున్న బి. శివధర్ రెడ్డి ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు.1991 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సి.వి. ఆనంద్, పోలీస్ శాఖలో అనేక కీలక బాధ్యతలను విజయవంతంగా నిర్వహించారు. గతంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీజీగా పనిచేసి తన పరిపాలనా నైపుణ్యాన్ని చాటుకున్నారు.చట్ట-వ్యవస్థ నిర్వహణలో అనుభవం, సమర్థవంతమైన నాయకత్వం కారణంగా ఆయనకు ఈ అత్యున్నత పదవి దక్కింది. మే 1వ తేదీ నుంచి ఆయన అధికారికంగా డీజీపీ బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు సమాచారం.ఈ నియామకం రాష్ట్ర పోలీస్ వ్యవస్థలో కీలక మార్పులకు నాంది పలుకుతుందని అధికారులు మరియు ప్రజలు భావిస్తున్నారు.



## డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం..

**బాలికల విద్యను ప్రోత్సహిద్దాం: సూర్యాపేట జిల్లా సంక్షేమ అధికారి కే. నరసింహారావు**

**కిషోర బాలికల ఆరోగ్యం, భద్రత పై అవగాహన**

**మన దునియా ప్రతినిధి పెన్ పహాడ్**



డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం.. బాలికల విద్యను ప్రోత్సహిద్దామని జిల్లా సంక్షేమ అధికారి కే. నరసింహారావు అన్నారు. మండలం కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యా నిలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మిషన్ వాత్సల్య పథకం క్రింద జిల్లా బాలల పరిరక్షణ విభాగం మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కిషోర బాలికల గర్భధారణ, మాదక ద్రవ్యాల వినియోగం, నిర్మూలన, సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ బాలికలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో పాటు జీవిత లక్ష్యాలపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. చిన్న వయసులో గర్భధారణ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, చదువులో అంతరాయం వంటి అంశాలను వివరించారు. అలాగే సమాజంలో పెరుగుతున్న మాదక ద్రవ్యాల వినియోగం యువతపై చూపుతున్న ప్రభావాన్ని వివరించి, అలాంటి అలవాట్లకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలు రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. అనుమానాస్పద లింకులు, అపరిచిత వ్యక్తులతో చాటింగ్ వంటి అంశాల్లో అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ బాలికల శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించి, సరైన పోషకాహారం, పరిశుభ్రత పాటించడం ఎంత ముఖ్యమో వివరించారు. బాలల హక్కులు, చట్టపరమైన రక్షణల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి చైర్పర్సన్ రమణారావు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంక్షేమ అధికారి రవికుమార్, డిప్యూటీ డిఎంహెచ్ వో చంద్రశేఖర్, సి డబ్ల్యూ సి మెంబర్ ధనమ్మ, ఎంఈఓ రవి, ఎస్ ఓ ఆసియా జబీనా, ఎయిడ్ సంస్థ కమ్యూనిటీ సోషల్ వర్కర్ వి. సోమన్న, ఐసిడిఎస్ సూపర్వైజర్లు స్వప్న, హనీఫా, సోషల్ వర్కర్ శ్రీలక్ష్మి, చైల్డ్ లైన్ వర్కర్ ఉమామహేశ్వరి, అంగన్వాడి కార్యకర్తలు ఊర్మిళాదేవి, విజయ తదితరులు పాల్గొన్నారు.

## చింతూరు గ్రామపంచాయతీ పరిధిలోని రోడ్డుకు ఇరువైపులా అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలనుతొలగింపు





**మన దునియా, వాజేడు ,ఏప్రిల్ 28**

వాజేడు మండలం చింతూరు గ్రామపంచాయతీ పరిధిలోని రోడ్డు ప్రక్కన ఉన్న చెట్ల కొమ్మలు ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారి వాహనాలకు తగలటంతో ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉండటంతో అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను గ్రామపంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్తుల సహకారంతో జెసి బి తో కొమ్మలను తొలగించడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆమని గ్రామ పంచాయితీ సర్పంచ్ తెల్లం సుమాంజలి మాజీ సర్పంచ్ తెల్లంబుల్లేశ్వరరావు గ్రామపంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వెంకట్రావు





**మన దునియా, వాజేడు ,ఏప్రిల్ 28**

దుమ్మగూడెం మండలం ఎంపీడీవో కార్యాలయం వద్ద కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లా వెంకటరావు మండల నాయకులు దుమ్మగూడెం మండలంలో 65 కుటుంబాలకు అక్షరాల 65,07,540 రూపాయలు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా సంబంధితులకు అందజేయడం జరిగింది వారిలో ఎస్టీ 39 మంది ఎస్సీ 11మంది బిసి 15 మంది మొత్తం కలిపి 65 మంది అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను రాష్ట్ర మారుమూల ప్రాంత ప్రజలకు అందిస్తున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డికి మరియు ఉపముఖ్యమంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్క గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు దనసరి సీతక్క రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరియు వీరందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం మండల లో 37 పంచాయతీల సర్పంచులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల అధికారులు మండల కార్యకర్తలు ప్రజాప్రతినిధులు యువత నాయకులు తదితరులు పాల్గొన్నారు

## కీ.శే తెల్లం నరేష్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్ల వెంకటరావు

**మన దునియా ,వాజేడు ,ఏప్రిల్ 28**

ఈరోజు దుమ్మగూడెం మండలం లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ కోఆర్డినేటర్ తెల్లం నరేష్ అనారోగ్యంతో మరణించగా వారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు విద్యార్థి దశ నుండి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొని రాష్ట్రస్థాయి నేతల పేరు పొందిన కీ .శే . తెల్లం నరేష్ మరణించడం చాలా బాధాకరమైన విషయం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

ఏప్రిల్ | బుధవారం | 29 | 2026



# చేనేత జౌళి రంగాన్ని బలోపేతం చేసి ఎగుమతులను ప్రోత్సహించాలి..!

**జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

**మన దునియా,కడప,ఏప్రిల్ 28**

భారతీయ వస్త్ర రంగాన్ని ప్రపంచ మార్కెట్ లో మరింత బలోపేతం చేసే దిశగా.. జిల్లాలో జౌలు పరిశ్రమను, ఉత్పత్తుల ఎగుమతులను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులకు సూచించారు.మంగళవారం "టెక్స్ టైల్ ఎగుమతుల విజన్2030" ప్రణాళికపై రాష్ట్ర చేనేత జౌలు శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సిసోడియా.. ఆ శాఖ కమిషనర్ రేఖారాణితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. విసి ముగిసిన అనంతరం కలెక్టర్ ఛాంబర్ లో.. రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి, కమీషనర్ వారి సూచనల మేరకు జిల్లా అధికారులకు టెక్స్ టైల్ ఎగుమతుల విజన్2030 ప్రణాళికపై జిల్లా కలెక్టర్ పలు ఆదేశాలు, సూచనలిచ్చారు.భారతీయ వస్త్ర (టెక్స్ టైల్) రంగాన్ని ప్రపంచ స్థాయిలో మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం "టెక్స్ టైల్ ఎగుమతుల విజన్2030"ను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ఈ ప్రణాళిక ద్వారా 2030 నాటికి దేశ టెక్స్ టైల్ ఎగుమతులను 100 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. ప్రస్తుతం 2024-25 ఆర్థిక సంవత్సరంలో టెక్స్ టైల్ ఎగుమతులు 37.76 బిలియన్ డాలర్లుగా ఉండగా, ఈ రంగంలో సుమారు 4.5 కోట్ల మందికి ఉపాధి లభిస్తోందన్నారు. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలంటే వచ్చే ఐదు సంవత్సరాల్లో దాదాపు 2.7 రెట్లు వృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొంటున్నారన్నారు. మన దేశంలో పత్తి, జూట్, పట్టు మరియు మాన్-మేడ్ ఫైబర్స్ ఉత్పత్తిలో ప్రపంచంలో రెండో స్థానంలో ఉన్నప్పటికీ, టెక్స్ టైల్ ఎగుమతుల్లో మాత్రం ఆరో స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా 527 జిల్లాల్లో ఉత్పత్తి జరుగుతున్నప్పటికీ, కేవలం 25 జిల్లాల నుంచే 68 శాతం ఎగుమతులు జరగడం గమనార్హం అన్నారు. ప్రపంచ మార్కెట్‌లో మాన్-మేడ్ ఫైబర్స్, ఫాస్ట్ ఫ్యాషన్, టెక్నికల్ టెక్స్ టైల్ మరియు సస్టైనబుల్ ఉత్పత్తుల వైపు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో భారత్ వేగంగా తన ఉత్పత్తి విధానాలను సర్దుబాటు చేసుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు.ఈ లక్ష్య సాధన కోసం కేంద్ర టెక్స్ టైల్ మంత్రిత్వ శాఖ నాలుగు దశల కార్యాచరణ ప్రణాళికను రూపొందించిందన్నారు. మొదటి దశలో కాన్సెప్ట్ నోట్‌ను రాష్ట్రాలకు పంపించి అభిప్రాయాలను సేకరించగా, రెండో దశలో జాతీయ స్థాయి కన్సల్టేటివ్ వర్క్‌షాప్ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రస్తుతం మూడో దశలో రాష్ట్రాల స్థాయిలో వర్క్‌షాప్‌లు నిర్వహిస్తూ జిల్లాల వారీ ఎగుమతుల సామర్థ్యాలను గుర్తించడం జరుగుతోందన్నారు. తదుపరి దశలో జాతీయ సదస్సులో తుది కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేయనున్నారన్నారు.అయితే ఈ రంగం అభివృద్ధికి కొన్ని కీలక సవాళ్లు కూడా ఉన్నాయని, ఎగుమతులు ప్రధానంగా అమెరికా, యూరప్ మార్కెట్లపైనే ఆధారపడటం, పత్తి ఉత్పత్తులపై అధిక మొగ్గు చూపడం, రవాణా మరియు విద్యుత్ ఖర్చులు అధికంగా ఉండడం, సస్టైనబిలిటీ ప్రమాణాల్లో లోపాలు, అలాగే మీవీజు రంగంలో ఆర్థిక, సాంకేతిక పరిమితులు మొదలైన అంశాలు టెక్స్ టైల్ రంగం వృద్ధికి ఆటంకంగా మారుతున్నాయన్నారు.ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక అవకాశాలు ఉన్నట్లు గుర్తించారన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, గుంటూరు, పల్నాడు జిల్లాలను చాంపియన్ జిల్లాలుగా ఎంపిక చేయగా, తూర్పు గోదావరి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, ప్రకాశం, బాపట్ల, నెల్లూరు, తిరుపతి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలను ఆస్పిరేషనల్ జిల్లాలుగా గుర్తించడం జరిగిందన్నారు.కాగా.. సమన్వయంతో కూడిన ప్రణాళిక, రాష్ట్రాల భాగస్వామ్యం, మరియు సమర్థవంతమైన అమలు ద్వారా భారత్ టెక్స్ టైల్ రంగంలో విశేష ప్రగతి సాధించి, 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల ఎగుమతి లక్ష్యాన్ని చేరుకునే అవకాశాలు ఉన్నాయని ఆ దిశగా జిల్లాలోని టెక్స్ టైల్ ఉత్పత్తి వనరులను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకుని.. భారత వస్త్ర ఉత్పత్తుల ఎగుమతుల వృద్ధిలో మనం కూడా భాగస్వామ్యం కావాలని కోరారు. జిల్లాలో ఉన్న చేనేత, జౌళి ఉత్పత్తులను గుర్తించి.. ఎగుమతులను ప్రోత్సహించాలన్నారు. ఇంకను ఎవరైనా కొత్త యూనిట్లను ప్రారంభించే ఆలోచన ఉన్న ఔత్సాహికులకు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. కొత్త యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన వనరులను గుర్తించాలన్నారు. చేనేత సంఘాలను కూడా ప్రోత్సహిస్తూ జిల్లాలో చేనేత జౌలు పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో హ్యాండ్లూమ్స్ ఏడి పిచ్చేశ్వర నాయుడు, ఏపీఐఐసి జెడ్ఎం శ్రీనివాసమూర్తి, ఇండస్ట్రీస్ జిఎం చాంద్ బాషా, హ్యాండ్లూమ్స్ ఏడిఓ శేషగిరిరావు, టెక్సానా కంపెనీ హెచ్ఆర్ హరికృష్ణ, ఆదిత్య బిర్లా హెచ్ఆర్ ప్రభాకర్, సంబందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## టేకులగూడెంలో డ్రగ్స్ నియంత్రణ మరియు కొన్ని ముఖ్యమైన విషయాలు తెలియజేసిన ఇన్చార్జి తిరుపతి రెడ్డి






**మన దునియా, వాజేడు ,ఏప్రిల్ 28**

డ్రగ్స్ అనేది సేవించడం వలన వారి యొక్క కుటుంబానికి కాకుండా మరియు సమాజాన్ని కి కూడా తీర నష్టాన్ని కలిగిస్తుందని ఇన్చార్జి ఎస్ఐ తిరుపతిరెడ్డి అన్నారు డ్రగ్స్ సేవించడం వలన మానసిక సమస్యలు నిరాశ ఆందోళన మరియు ఆలోచనశక్తి కోల్పోవడం శరీరక సమస్యలు గుండె కాలేయం మరియు ఈ వ్యసనం వలన మెదడు పనితీరు మారిపోయి డ్రగ్స్ లేకుండా ఉండలేని స్థితి ఏర్పడుతుంది అన్నారు ముఖ్యంగా యువత చెడు స్నేహాలకు దూరంగా ఉండాలి ఆరోగ్యకరమైన అలవాట్లు క్రీడలు యోగ మరియు ఇతర సృజనాత్మక పనులపై దృష్టి పెట్టాలి అని యువతకు అవగాహన కల్పించారు దీనిలో భాగంగా 18 సంవత్సరాలు దాటిన వారికి డ్రైవింగ్ లైసెన్స్ మరియు హెల్మెంట్ తో డ్రైవింగ్ చేయాలని బండికి ఇన్సూరెన్స్ తో కలిగి ఉండాలని చెడు వ్యసనాలకు బానిస కావద్దని చెడు వ్యసనాలు ఉన్న చోటికి పోకుండా క్రీడల వైపు మొగ్గు చూపాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో టేకులగూడెం గ్రామస్తులు యువత మరియు పోలీస్ సిబ్బంది ఇన్చార్జి ఎస్సై తిరుపతి రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు

## వెల్లుల్లి పరిమితి దాటి తింటే అనారోగ్య సమస్యలు తప్పవు

వెల్లుల్లిని ఆయుర్వేదం ప్రకారం సర్వ రోగ నివారిణిగా పిలుస్తారు. ముఖ్యంగా వెల్లుల్లి లేకుండా ఏ భారతీయ వంటకం ఉండదంటే అతిశయోక్తి కానేకాదు. వెల్లుల్లి కేవలం రుచి కోసమే కాకుండా..ఆరోగ్యపరంగా కూడా చాలా లాభదాయకం. ప్రతి భారతీయుని కిచెన్‌లో తప్పకుండా లభించే పదార్థం వెల్లుల్లి, సాధారణంగా వెల్లుల్లిని తాలింపు కోసం లేదా వంటల రుచి కోసం ఉపయోగిస్తుంటారు. అయితే అంతకుమించిన ఆరోగ్య ప్రయోజనాలు వెల్లుల్లిలో దాగున్నాయి. అందుకే తల్లి చేసే మేలు వెల్లుల్లి కూడా చేయదంటారు. కానీ వెల్లుల్లిని మోతాదుకు మించి తినకూడదంటారు. పరిమితి దాటితే వెల్లుల్లితో అనర్థాలే ఎక్కువ. ఆ వివరాలు మీ కోసం..వెల్లుల్లిని ఆయుర్వేద శాస్త్రంలో ఆరోగ్య ఖజానాగా పిలుస్తారు. ఎందుకంటే వెల్లుల్లిలోని పోషక పదార్థాలు చాలా ఎక్కువ. ఇందులో విటమిన్ బి1, కాల్షియం, కాపర్, పొటాషియం, ఫాస్ఫరస్, ఐరన్ వంటి న్యూట్రియంట్లు ఉన్నాయి. అయితే మోతాదు దాటకూడదు. వెల్లుల్లి మోతాదు దాటి తినడం వల్ల ఛాతీలో మంట సమస్య ఏర్పడుతుంది. దీనికి కారణం వెల్లుల్లిలో ఎసిడిక్ కాంపౌండ్ ఎక్కువగా ఉండటం. ఈ మంట చాలా సందర్భాల్లో భరించలేకుండా ఉంటుంది.వెల్లుల్లితో రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. అందుకే లో బీపీ రోగులు వెల్లుల్లి తీసుకోకూడదు. వెల్లుల్లి అతిగా తీసుకుంటే హైపర్ టెన్షన్ సమస్య ఏర్పడవచ్చు. శరీరంలో విపరీతమైన అలసట ఉంటుంది. వెల్లుల్లి స్వభావం వేడి చేసేది కావడంతో వేసవిలో వెల్లుల్లికి దూరంగా ఉండాలి. చలి సంబంధిత సమస్యలున్నప్పుడు వెల్లుల్లి తినడం చాలామందికి అలవాటు. ఆరోగ్యానికి ఎంతమంచిదైనా సరే రోజుకు 1-2 రెమ్మలకు మించి తినకూడదు. అదే పనిగా వెల్లుల్లి తింటే నోటి దుర్వాసన కూడా వస్తుంది.



## ఖాతాదారు, నామినీ ఇద్దరూ మరణిస్తే.. బ్యాంకు డబ్బు వారసులకే!

**మన దునియా,హైదరాబాద్: ఏప్రిల్ 28**




ఖాతాదారు, నామినీ ఇద్దరూ మరణిస్తే.. బ్యాంకు డబ్బు వారసులకే! బ్యాంకు ఖాతాదారుడు, నామినీ ఇద్దరూ మరణించిన సందర్భంలో, డిపాజిట్ చట్టబద్ధమైన వారసులకు చెందుతుందని RBI, బ్యాంకింగ్ చట్టాలు స్పష్టం చేశాయి. నామినీ కేవలం ధర్మకర్త మాత్రమేనని, ఆస్తి యజమాని కాదని సుప్రీంకోర్టు పేర్కొంది. వీలునామా ఉంటే దాని ప్రకారం, లేదంటే వారసత్వ చట్టాల ప్రకారం వారసత్వం నిర్ణయమవుతుంది. 10 ఏళ్ల తర్వాత క్లెయిమ్ చేయని డబ్బు ఐజూూఖీ నిధికి బదిలీ అయినా, వారసులు ఎప్పుడైనా క్లెయిమ్ చేసుకోవచ్చు. నామినీ లేకపోయినా, చట్టబద్ధమైన వారసులకే ఆ నిధులు చెందుతాయి. ఉమ్మడి ఖాతాల్లో ఒక ఖాతాదారుడు మరణిస్తే, మరొకరికి పూర్తి హక్కులు లభిస్తాయి.

## సోదరి అస్థిపంజరంతో బ్యాంకుకు వెళ్లిన గిరిజనుడు.. డబ్బుల విత్‌డ్రాకు డెత్ సర్టిఫికెట్ అడగడంతో..



**మన దునియా ఒడిశా,కియోంజర్ జిల్లా:ఏప్రిల్ 28**

ఒడిశాలోని కియోంజర్ జిల్లాలో వెలుగుచూసిన ఈ హృదయ విదారక ఘటన మానవత్వాన్ని ప్రశ్నిస్తోంది. నిబంధనల పేరుతో బ్యాంకులు సామాన్యులను ఎంతటి వేదనకు గురిచేస్తాయో చెప్పడానికి ఈ సంఘటనే నిదర్శనం.కియోంజర్ జిల్లా డియానాలి గ్రామానికి చెందిన జితు ముండా అనే వ్యక్తి, తన సోదరి కాక్రా ముండా అకౌంట్లో ఉన్న రూ. 19,300 డ్రా చేసుకునేందుకు పడరాని పాట్లు పడ్డాడు. కాక్రా ముండా రెండు నెలల క్రితమే మరణించింది. ఆమె భర్త, ఏకైక సంతానం అంతకుముందే మరణించడంతో, జితు ఒక్కడే ఆమెకు మిగిలి ఉన్న ఏకైక బంధువు. తన సోదరి అంత్యక్రియలు, ఇతర ఖర్చుల కోసం ఆ డబ్బు అవసరమవ్వడంతో అతను ఒడిశా గ్రామీణ్ బ్యాంకు్న ఆశ్రయించాడు.అయితే, బ్యాంకు మేనేజర్ నిబంధనల పేరుతో డబ్బు ఇవ్వడానికి నిరాకరించారు. ఖాతాదారు స్వయంగా రావాలని లేదా వారసుడిగా ధృవీకరించే చట్టపరమైన పత్రాలు సమర్పించాలని ఖరాకండిగా చెప్పారు. చదువుకోని గిరిజనుడైన జితు వద్ద మరణ ధృవీకరణ పత్రం (ఐమథ్ష్ర జవతీటఱటఱష్ఫవ) గానీ, వారసత్వ పత్రాలు గానీ లేవు. ఆ క్లిష్టమైన ప్రక్రియ అర్థం కాక నిస్సహాయ స్థితిలో వెనుతిరిగిన జితు, సోమవారం ఒక సంచలన నిర్ణయం తీసుకున్నాడు. స్మశానానికి వెళ్లి తన సోదరి అస్థిపంజరాన్ని తవ్వి తీసి, దానిని ఒక గుడ్డలో చుట్టి భుజాన వేసుకుని, మండుటెండలో 3 కిలోమీటర్లు నడిచి బ్యాంకుకు చేరుకున్నాడు.బ్యాంకు వద్ద ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు నివ్వెరపోయారు. నిబంధనల కంటే మానవత్వం ముఖ్యం కాదా అని బ్యాంకు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం సర్పంచ్ ద్వారా ధృవీకరించుకోవడమో లేదా క్షేత్రస్థాయి పరిశీలన చేయడమో చేయకుండా, ఒక పేదవాడిని ఇలా ఇబ్బంది పెట్టడంపై నిరసన వ్యక్తమైంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని జితును ఓదార్చారు. ఈ విషయాన్ని మానవతా దృక్పథంతో పరిష్కరిస్తామని, బ్యాంకు నుండి వివరణ కోరుతామని పోలీసులు హామీ ఇచ్చారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# షుగర్ ఫ్రీ స్నాక్స్ ఆరోగ్యానికి మంచిదా?

కాలం మారుతున్న కొద్దీ మనం తినే ఆహారంలో కూడా విషపూరిత అంశాలు చేరిపోతున్నాయి. మనం రోజూ తినే ఆహారమే నేడు మనిషి ఎదుర్కొంటున్న అనేక వ్యాధులకు కారణం. మొదట్లో, చెడుకు బానిసలుగా ఉన్నవారు మాత్రమే అనారోగ్యానికి గురవుతారు. అయితే ఇప్పుడు మనం తినే ఆహారంలో కాస్త మార్పు వచ్చినా గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో షుగర్, స్థూలకాయం, క్యాన్సర్ వంటి సమస్యలు పంచదారతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల వస్తాయని చెప్పారు. అందువల్ల, చాలా మంది ప్రజలు చక్కెర ఆహారాలకు దూరంగా ఉండటం , చక్కెర లేని ఉత్పత్తులను తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని గడుపుతున్నారని అనుకుంటారు. అయితే మనం అనుకున్నట్లుగా చక్కెర రహిత ఉత్పత్తులు నిజంగా ఆరోగ్యానికి మంచివేనా? దీని గురించి నిపుణులు ఏమంటారు? పేరు సూచించినట్లుగా, చక్కెరను ఉపయోగించకుండా చక్కెర రహిత ఉత్పత్తులు తయారు చేయబడతాయి . కానీ తీపి రుచిని అందించడానికి తక్కువ కేలరీలతో ప్రత్యామ్నాయ స్వీటెనర్లను ఉపయోగిస్తారు. అస్పర్టమే సాధారణంగా అటువంటి చక్కెర రహిత ఉత్పత్తులలో ఉపయోగిస్తారు. వీటిని సాధారణంగా చూయింగ్ గమ్ , బేకింగ్ సోడాలో ఉపయోగిస్తారు. అస్పర్టమే కాకుండా, సాచరిన్ , సుక్రలోజ్ కూడా సాధారణంగా చక్కెర రహిత ఉత్పత్తులలో కనిపిస్తాయి. ఇప్పుడు మన ముందున్న ప్రశ్న ఏమిటంటే, చక్కెరను ఉపయోగించకుండా తయారు చేసే ఈ షుగర్ ఫ్రీ ఉత్పత్తుల వినియోగం నిజంగా ఆరోగ్యానికి మంచిదేనా, పోషకాహార నిపుణుడు అమిత గాద్రే ప్రకారం, చక్కెర కంటెంట్ వినియోగంతో పోలిస్తే చక్కెర లేని స్వీట్లు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదే. ఉత్పత్తులు. కానీ షుగర్ లేదనే కారణంతో ఎక్కువగా తినడం ప్రారంభిస్తే సమస్యలు వస్తాయి. పండుగల సమయంలో తరచుగా భోజనం చేయడంలో తప్పులేదు. ప్రతిరోజూ షుగర్ ఫ్రీ ఉత్పత్తులను తీసుకోవడం ఖచ్చితంగా మంచిది కాదు. షుగర్ ఫ్రీ క్యాండీలలో కూడా మీరు జాగ్రత్తగా ఉండాలి, ఎందుకంటే వాటిలో మీ క్యాలరీలను పెంచే ఇతర పదార్థాలు ఉంటాయి. అమిత ప్రకారం, మీరు వారానికి ఒకసారి చక్కెర లేని ఉత్పత్తిని తీసుకోవచ్చు. మిఠాయిల కోసం మార్కెట్లకు వెళ్లినప్పుడు రెండు రకాల స్వీట్లు దొరుకుతాయి. ఒకదానిలో షుగర్ వాడలేదని రాసి ఉండగా, మరో దానిలో షుగర్ ఫ్రీ అని రాసి ఉంది. మంచి ఆరోగ్యం విషయంలో దేన్ని ఎంచుకోవాలి అనే విషయంలో వినియోగదారులుగా మనం అయోమయం చెందడం సర్వసాధారణం. అయితే రెంటికి ఏమైనా తేడా ఉందా? లేక వీరిద్దరూ మిఠాయిల కోవకు చెందినవారే అనే సందేహం రావడం సహజం. వారు చక్కెరను ఉపయోగించరు లేదా చక్కెర రహితంగా లేబుల్ చేయబడిన ఉత్పత్తులలో చక్కెరకు ప్రత్యామ్నాయంగా ఏ ఇతర ఉత్పత్తిని ఉపయోగించరు. కానీ ఆ మిఠాయిని తయారు చేయడానికి ఉపయోగించే ఇతర పదార్థాలు తీపి భాగం కలిగి ఉండవచ్చు. కానీ షుగర్ ఫ్రీ ఉత్పత్తులలో చక్కెర ఉండదు. బదులుగా, అస్పర్టమే, సాచరిన్ , సుక్రలోజ్ వంటి పైన పేర్కొన్న పదార్థాలు ఉపయోగించబడతాయి. వీటిలో ఏది తినాలనేది మన ఇష్టం.





## ఈ టీలు తాగితే చాలు.. బెల్లీ ఫ్యాట్ కరిగిపోవడం ఖాయం!



ప్రస్తుత రోజుల్లో స్త్రీ పురుషులు చాలామంది అధిక బరువు బెల్లీ ఫ్యాట్ సమస్యతో ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. వీటి కారణంగా చాలామంది వారి సొంత పనులు చేసుకోవడానికి కూడా ఇబ్బంది పడుతూ ఉంటారు.కొన్ని కొన్ని సార్లు ఈ బెల్లీ ఫ్యాట్ కారణంగా బాడీ షేమింగ్ కామెంట్స్ ని కూడా ఎదుర్కోవాల్సి వస్తూ ఉంటుంది. అయితే ఈ బెల్లీ ఫ్యాట్ ని కరిగించుకోవడం కోసం కొన్ని రకాల టీలు బాగా ఉపయోగపడతాయి అని చెబుతున్నారు. ఇంతకీ ఆ టీ లు ఏవి అన్న విషయానికి వస్తే.. బరువు తగ్గడానికి ఉపయోగించే తీలను స్లిమ్మింగ్ టీలు అని పిలుస్తారు. ఈ స్లిమ్మింగ్ టీకి దాని ప్రభావాన్ని అందించే రెండు ప్రాథమిక పదార్థాలు కెఫిన్ , పాలీఫెనాల్స్. అదనపు ట్రైగ్లిజరైడ్‌లను కరిగించే నిర్దిష్ట ఎంజైమ్‌ను ప్రేరేపించడం ద్వారా, పాలీఫెనాల్స్ భాగం శరీరంలో అధిక ట్రైగ్లిజరైడ్ ఏర్పడే ప్రమాదాన్ని తొలగిస్తుందట. అలాగే శరీరంలో కొవ్వును సైతం కరిగిస్తుందని చెబుతున్నారు. కాగా స్లిమ్మింగ్ టీ తాగడం వల్ల జీవక్రియ రేటును పెంచడంలో సహాయపడుతుందట. ఇది శరీరంలో కొవ్వును చాలా తొందరగా కరిగిస్తుందని, ఇది వినియోగించే కేలరీల పరిమాణాన్ని కూడా తగ్గిస్తుందని చెబుతున్నారు. కార్బోహైడ్రేట్లు, చక్కెరలను కొవ్వుగా మార్చకుండా శరీరాన్ని నిరోధిస్తుందట. ఇది శరీరంలో ని కొవ్వు పరిమాణాన్ని తగ్గిస్తుందని, మీరు బరువు తగ్గడానికి కొన్ని సులభమైన కార్యకలాపాలతో స్లిమ్మింగ్ టీని కూడా తాగేస్తే, సులభంగా బరువు తగ్గవచ్చని చెబుతున్నారు వైద్యులు. బయట మార్కెట్లో మనకు అనేక రకాల స్లిమ్మింగ్ టీలు అందుబాటులో ఉన్నాయి. వాటిని తాగడం వల్ల ఈజీగా మీరు అధిక బరువుతో పాటు బెల్లీ ఫ్యాట్ ని కూడా కరిగించుకోవచ్చు.

## ఈ ఫేస్ ప్యాక్ ట్రై చేస్తే చాలు.. నిముషాల్లో స్కిన్ మెరిసిపోవాల్సిందే!

చాలామంది స్త్రీ పురుషులు అందంగా కనిపించడం కోసం వేలకు వేలు డబ్బులు ఖర్చు చేస్తూ ఉంటారు. బ్యూటీ పార్లర్ల చుట్టూ తిరుగుతూ, రకరకాల బ్యూటీ ప్రోడక్టులు ఉపయోగిస్తూ ఉంటారు. ఇంకొందరు సహజంగా కనిపించే అందం కోసం ప్రయత్నిస్తూ ఉంటారు. కొందరు ఫంక్షన్ల కోసం నిమిషాల్లోనే మెరిసిపోయే స్కిన్ కావాలని కోరుకుంటూ ఉంటారు. మరి అలాంటి వాళ్ళు ఎటువంటి ఫేస్ ప్యాక్ ట్రై చేయాలో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. అందులో మొదటిది శనగపిండి, పసుపు ఫేస్ ప్యాక్ కూడా ఒకటి. ఈ ప్యాక్ చేయడానికి మీరు రెండు టేబుల్ స్పూన్ల శెనగపిండి, ఒక టీస్పూన్ పసుపు పొడిని కలపాలి. పేస్ట్ చేయడానికి పాలు లేదా రోజ్ వాటర్ ఉపయోగించవచ్చు. దీన్ని మీ ముఖానికి అప్లై చేసి 20 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. తర్వాత శు భ్రం చేస్తే సరిపోతుందట. మరొక రెమిడీ విషయానికి వస్తే.. బంగాళదుంప అలోవెరా, శెనగపిండి ఫేస్ ప్యాక్.. అయితే ఈ ప్యాక్ చేయడానికి బంగాళదుంప గుజ్జు, అలోవెరా జెల్ , రెండు టేబుల్ స్పూన్ల శెనగపిండిని కలపాలి. మీరు పేస్ట్ చేయడానికి నీటిని ఉపయోగించవచ్చు. ఈ ణ౯ ఫేస్ ప్యాక్‌ని అప్లై చేసి, మీ చర్మంపై 10 నిమిషాల పాటు ఉంచి, తర్వాత శుభ్రం చేయవచ్చని చెబుతున్నారు. మరో ఫేస్ ప్యాక్ విషయానికి వస్తే.. నిమ్మకాయ టమాటో ఫేస్ ప్యాక్ తో ఇన్స్టంట్ అందాన్ని పొందవచ్చు అని చెబుతున్నారు. మరి ఈ మిశ్రమాన్ని ఎలా తయారు చేసుకోవాలి అన్న విషయానికి వస్తే.. ఈ ప్యాక్ కోసం, టొమాటో గుజ్జును తీసుకొని, ఒక టీస్పూన్ నిమ్మరసం జోడించాలి. అలా అప్లై చేసి 15 నిమిషాల పాటు అలాగే ఉంచి ఆ తర్వాత ముఖం శుభ్రం చేసుకోవాలి. మెరిసే చర్మం సొంతం కావాలి అనుకున్న వారు కాఫీ పాలు ప్యాక్ ట్రై చేస్తే చాలు. అందుకోసం ఈ రెండు పదార్థాలను 2:1 నిష్పత్తిలో కలిపి, మీ ముఖం మీద అప్లై చేయాలి. పాలలోని లక్షణాలు మీ చర్మానికి స్థితిస్థాపకతను నిర్ధారిస్తాయి. ఇది ముఖంపై ముడతలను తగ్గించడంతో పాటు, ముఖం మెరిసిపోయేలా చేయడంలో సహాయపడుతుందని చెబుతున్నారు.



## ఉద్యోగులు చేయి, మణికట్టు నొప్పితో ఎందుకు బాధపడుతున్నారు..?



నిరంతరం కంప్యూటర్ ముందు కూర్చునే వృత్తి నిపుణులు పని చేయడం సహజం. రోజులో ఎక్కువ భాగం పనికి కేటాయించడం అనేది కొంత మందిలో ఏదో ఒక అవసరం , ఆధునిక జీవనశైలి వలె దీనిని నివారించలేము అనేది కూడా వాస్తవం. చాలా మంది పని నిపుణులు పనిలో ఎక్కువ గంటలు గడపడం వంటి అనేక కారణాల వల్ల వేళ్లు, మణికట్టు, మోచేతులు , చేతుల్లో తీవ్రమైన నొప్పిని అనుభవిస్తారు. ఈ నొప్పిని తనిఖీ చేయకపోతే, ఇది దీర్ఘకాలిక చలనశీలత సమస్యలకు దారి తీస్తుంది. మీరు చేయగలిగే అనేక చేతి వ్యాయామాలు ఉన్నాయి, దీని కోసం డాక్టర్ లేదా ఫిజియోథెరపిస్ట్ మీకు మార్గనిర్దేశం చేయవచ్చు. ఆఫీసుకు వెళ్లేవారిలో చేయి నొప్పికి ఆరు సాధారణ కారణాల గురించి తెలుసుకుందాం. కంప్యూటర్‌ను ఉపయోగిస్తున్నప్పుడు టైపింగ్, మౌస్ ఉపయోగించడం, చేతిని నిరంతరం ఎత్తడం వంటి పునరావృత కదలికలు తరచుగా జరుగుతాయి, ఇది కండరాలు, స్నాయువులు , నరాలలో మంట , మైక్రోట్రామాకు దారితీస్తుంది. ఇది సాధారణంగా మణికట్టు, మోచేతులు , భుజాలను ప్రభావితం చేస్తుంది. కీబోర్డ్ , మౌస్ ఎక్కువసేపు ఉపయోగించడం వల్ల తరచుగా చేతులు , మణికట్టులో నొప్పి వస్తుంది. కొన్నిసార్లు తప్పు టైపింగ్ టెక్నిక్ లేదా గ్రిప్ ఉపయోగించే అవకాశాలు ఉన్నాయి. ఇందుకోసం మధ్యమధ్యలో చిన్నపాటి విరామాలు తీసుకోవడం, చేతులు, చేతులు, భుజాలను సాగదీయడం వంటి సాధారణ వ్యాయామాలు చేయవచ్చు. మీ కుర్చీ చాలా ఎత్తుగా లేదా చాలా తక్కువగా ఉంటే లేదా మీ డెస్క్ , మానిటర్ సరిగ్గా సర్దుబాటు చేయకపోతే, అది మీ మెడ, భుజాలు , చేతుల్లో ఒత్తిడిని కలిగిస్తుంది . ఈ నొప్పి మీ మణికట్టును ప్రభావితం చేసే కార్పల్ టన్నెల్ సిండ్రోమ్ , స్నాయువుల వాపు వంటి టెండినిటిస్ వంటి సమస్యలను కలిగిస్తుంది. మీకు సరిపోయేలా కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం ఈ సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. మీరు విరామం లేకుండా చాలా గంటలు పని చేస్తున్నారని గమనించండి. వ్యాయామం లేకపోవడం లేదా శారీరక శ్రమ లేకపోవడంతో పాటు పెరిగిన పని , ఒత్తిడి తీవ్రమైన నొప్పికి దారి తీస్తుంది. టెన్నిస్ ఎల్బో లేదా గోల్ఫర్స్ ఎల్బో వంటి టెండినిటిస్ (కండరాల వాపు) వంటి పరిస్థితులను నిర్ధారించడానికి మీ వైద్యుడికి వైద్య పరీక్ష సహాయపడుతుంది , ఇవి మోచేయిని ప్రభావితం చేసే సాధారణ సమస్యలు. ముఖ్యంగా పునరావృత కార్యకలాపాలు చేసే వ్యక్తులలో ఈ నొప్పులు సర్వసాధారణం. అలాంటి నొప్పి లేదా అసౌకర్యం ఉంటే, వైద్యుడిని చూడటం మంచిది. ఒక వ్యక్తి పేలవమైన , నిష్క్రియాత్మక జీవనశైలిని నడిపించినప్పుడు , శారీరక శ్రమలకు తక్కువ సమయం ఇచ్చినప్పుడు, వారు కండరాల నొప్పి సమస్యను అభివృద్ధి చేయవచ్చు. అదనంగా, ధూమపానం లేదా ఊబకాయం , మునుపటి గాయాలు లేదా మధుమేహం , ఆర్థరైటిస్ వంటి సమస్యలను కలిగి ఉన్న వ్యక్తులు చేతులు , చేతుల్లో నొప్పిని కలిగి ఉంటారు. దీని కోసం, క్రమం తప్పకుండా స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయండి , మీ పని స్థలాన్ని మీకు సౌకర్యవంతంగా ఉంచండి. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు కూడా చేయించుకోండి.

## తిప్పతీగ ఆకు తింటే తిప్పలన్నీ మాయం..



తిప్పతీగ ఆయుర్వేదంలో చాలా పురాతనమైన ఔషధ మొక్క. దీని ఆకులు, కాండం రెండూ అనేక ఆరోగ్య సమస్యలకు మంచి ఔషధంగా పనిచేస్తాయి. ఈ మొక్కలో పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి.ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అనేక వ్యాధులను తగ్గించడంలో సహాయపడుతుంది.1. ఎముకలు: తిప్ప తీగను ప్రధానంగా ఎముకల బలహీనత, విరుగుడు గాయాలు (ఫ్రాక్చర్) సందర్భాలలో ఉపయోగిస్తారు. ఇది ఎముక కణాలను పునరుత్పత్తి చేస్తుంది. విరిగిన ఎముకలు మళ్లీ త్వరగా కుదించడానికి సహాయపడుతుంది. ఇందులో కాల్షియం, ఫాస్పరస్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇది ఎముకల కండరాలను బలపరుస్తుంది.2. జీర్ణక్రియ: తిప్ప తీగ ఆకులను జీర్ణ సమస్యలకు ఆయుర్వేద వైద్యంలో విరివిగా ఉపయోగిస్తారు. ఇది అజీర్ణం, గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఇందులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి. తిప్ప తీగ ఆకుల ముద్దను తింటే జీర్ణక్రియ మెరుగు పడుతుంది.3. బరువు తగ్గడం: బచ్చలి కూరను బరువు తగ్గించే ప్రక్రియలో కూడా ఉపయోగిస్తారు. ఈ మొక్కలో ఉండే కాంపౌండ్స్ కొవ్వును కరిగించి శరీరంలో కొవ్వు నిల్వలను తగ్గిస్తాయి. ఇది శరీరంలో జీవక్రియను పెంచుతుంది. తద్వారా క్యాలరీలు తక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది సహాయపడుతుంది. 4. చక్కెర నియంత్రణ: తిప్పతీగ ఆకులు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. మధుమేహం ఉన్నవారికి ఇది ప్రధానంగా ఉపయోగపడుతుంది. ఈ మొక్కలోని రసాయనాలు ఇన్సులిన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను స్థిరంగా ఉంచుతాయి. అందువలన, ఇది మధుమేహం ప్రభావాన్ని తగ్గిస్తుంది. 5. కీళ్లనొప్పులు: తిప్ప తీగలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి. కీళ్లనొప్పులు వంటి వ్యాధుల నివారణలో ఈ మొక్కను ఉపయోగించడం వల్ల శరీరంలోని కీళ్లలో మంట మరియు నొప్పులు తగ్గుతాయి. జాయింట్ సెన్సిటివిటీని తగ్గించడం ద్వారా జాయింట్ ఫ్లెక్సిబిలిటీని మెరుగుపరుస్తుంది. 6. చర్మ సమస్యలు: తిప్ప తీగ ఆకులు చర్మ సమస్యలకు ఉపయోగపడతాయి. ఇందులోని క్రిమినా శక లక్షణాలు కోతలు, కాలిన గాయాలు, చర్మ ఇన్ఫెక్షన్ల వంటి చర్మ సమస్యలను నివారిస్తాయి. ఆకును రసాన్ని తీసుకుని చర్మానికి రాసుకుంటే చర్మంపై జిడ్డు, మొటిమలు తగ్గుతాయి.

## అందం కోసం విలువైన రహస్యం పటిక

పటిక అనేది బహుముఖ సహజ నివారణ. పటికను మీరు సాధారణంగా కొన్ని షాపుల్లో చూసే ఉంటారు. ఈ పటికలో క్రిమి సంహారక గుణాలు కలిగి ఉండడంతో, గాయాలైనప్పుడు రక్తం కారిపోకుండా పటిక కాపాడగలదు. ఇందులోని పొటాషియం, అల్యూమినియం, సల్ఫేట్ అనే రసాయన పదార్థాలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరిస్తాయి. ఇది జుట్టును శుభ్రపరచడంలో, శరీరంపై ముడుతలకు చికిత్స చేయడంలో, చెమటను నియంత్రించడంలో, చిగుళ్ల రక్తస్రావం నుండి ఉపశమనం పొందడంలో ఇంకా మూత్ర ఇన్ఫెక్షన్ల నుండి రక్షించడంలో సహాయపడుతుంది. పటికను దంతాలను శుభ్రపరచడానికి మరియు చిగుళ్ళను బలోపేతం చేయడానికి ఉపయోగిస్తారు. ఇది పంటి నొప్పిని కూడా తగ్గిస్తుంది. పటికను దంతాలను శుభ్రపరచడానికి, చిగుళ్ళను బలోపేతం చేయడానికి ఉపయోగిస్తారు. ఇది పంటి నొప్పిని కూడా తగ్గిస్తుంది. పటికలో యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. ఇది చర్మంపై ఇన్ఫెక్షన్లను నివారిస్తుంది. పటిక నీటితో జుట్టు కడగడం వల్ల తలపై ఉన్న జుట్టులో ఉండే మురికి, పేలు వంటి తొలిగిపోతాయి. పటికను రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయం మీ జుట్టును కడగాలి. యూరిన్ ఇన్ఫెక్షన్ నుండి ఉపశమనం కలిగించేందుకు ప్రైవేట్ పార్ట్ లను శుభ్రం చేయడానికి పటిక నీరు ఉపయోగపడుతుంది.



పటిక పొడి శరీరంలో వాపు, నొప్పిని తగ్గించడంలో ఉపయోగపడుతుంది. ప్రభావిత ప్రాంతంపై దీన్ని పూయడం మంచిది. పటిక నీటిని ముఖానికి పట్టించడం వల్ల ముడతలు తగ్గుతాయి. రెగ్యులర్ గా ఉపయోగించడం వల్ల చర్మం బిగుతుగా, కాంతివంతంగా మారుతుంది. పటిక చెమట వాసనను తగ్గించడంలో సహాయపడుతుంది. పటిక నీటితో స్నానం చేయడం వల్ల చెమట సమస్య తగ్గుతుంది. పటిక నీటితో పుక్కిలించడం చిగుళ్ల నుండి రక్తస్రావం నుండి ఉపశమనం కలిగిస్తుంది. నోటి దుర్వాసనను కూడా తగ్గిస్తుంది.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# నాడు కోహ్లీతో కలిసి వరల్డ్ కప్ ఆడాడు... ఇప్పుడు ఐపీఎల్ లో అంపైరింగ్ చేస్తున్నాడు!

**2008 అండర్-19 ప్రపంచకప్ హీరో.. ఇప్పుడు ఐపీఎల్ అంపైర్**

**మైదానంలో కలుసుకున్న విరాట్ కోహ్లీ, అజితేష్ అర్గల్**

**ఒకప్పుడు సహచరులు.. ప్రస్తుతం ఒకరు ఆటగాడు, మరొకరు అంపైర్**

**వారి కలయికకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్**

క్రికెట్ మైదానంలో ఎన్నో ఆసక్తికర దృశ్యాలు ఆవిష్కృతమవుతుంటాయి. అలాంటిదే ఐపీఎల్ 2026లో చోటుచేసుకుంది. ఒకప్పుడు ఒకే జట్టుకు ఆడి, దేశానికి ప్రపంచకప్ అందించిన ఇద్దరు ఆటగాళ్లు.. ఏళ్ల తర్వాత మళ్లీ ఒకే మైదానంలో కలుసుకున్నారు. అయితే వారి పాత్రలు మారాయి. ఒకరు స్టార్ బ్యాటర్‌గా కొనసాగుతుంటే, మరొకరు అంపైర్‌గా కొత్త బాధ్యతలు చేపట్టారు. వారే విరాట్ కోహ్లీ, అజితేష్ అర్గల్. 2008లో విరాట్ కోహ్లీ కెప్టెన్సీలో భారత్ అండర్-19 ప్రపంచకప్ గెలిచిన సంగతి తెలిసిందే. ఆ జట్టులో అజితేష్ అర్గల్ కీలక సభ్యుడు. దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్‌లో కేవలం 7 పరుగులిచ్చి 2 వికెట్లు తీసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. ఆ తర్వాత కోహ్లీ భారత జట్టులో సూపర్‌స్టార్‌గా ఎదిగితే, అర్గల్ కెరీర్ మాత్రం అంతగా ముందుకు సాగలేదు. కొంతకాలం ఐపీఎల్‌లో ఆడినా, తర్వాత క్రికెట్‌కు దూరమై ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో చేరాడు. అయితే, క్రికెట్‌పై మమకారం చంపుకోలేక బీసీసీఐ అంపైరింగ్ పరీక్షలో ఉత్తీర్ణులై, ఇప్పుడు ఐపీఎల్‌లో అంపైర్‌గా సేవలందిస్తున్నాడు. ఏప్రిల్ 27న ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌కు అర్గల్ అంపైర్‌గా వ్యవహరించాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత కోహ్లీ, అర్గల్ మాట్లాడుకుంటున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తమ పాత స్నేహితుడిని అంపైర్ పాత్రలో చూసిన కోహ్లీ నవ్వుతూ పలకరించడం అభిమానులను ఆకట్టుకుంది. ఒకే డ్రెస్సింగ్ రూమ్ పంచుకున్న స్నేహితులు.. ఒకరు ఆటగాడిగా, మరొకరు అంపైర్‌గా ఒకే మైదానంలో కలవడం "లైఫ్ ఫుల్ సర్కిల్" అంటూ ఫ్యాన్స్ కామెంట్లు చేస్తున్నారు.




# రాజస్థాన్ బౌలర్లపై విరుచుకుపడిన స్టోయినిస్... పంజాబ్ కింగ్స్ భారీ స్కోరు

**రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ భారీ స్కోరు**

**20 ఓవర్లలో 4 వికెట్లకు 222 పరుగులు చేసిన పంజాబ్**

**చెలరేగిన మార్కస్ స్టోయినిస్ (22 బంతుల్లో 62*)**

**ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ కీలక అర్ధ శతకం (59)**

**బౌలింగ్ ఎంచుకుని దెబ్బతిన్న రాజస్థాన్.. టార్గెట్ 223**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో పరుగుల వరద కొనసాగుతోంది. ముల్లన్‌పూర్‌లోని మహారాజా యాదవీంద్ర సింగ్ స్టేడియం వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ బ్యాటర్లు చెలరేగారు. ముఖ్యంగా ప్రభ్‌సిమ్రన్ సింగ్ అర్ధ శతకానికి మార్కస్ స్టోయినిస్ ఆడిన విధ్వంసకర ఇన్నింగ్స్ తోడవడంతో పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 222 పరుగుల భారీ స్కోరు సాధించింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ నిర్ణయం తప్పని పంజాబ్ ఓపెనర్లు నిరూపించారు. ముఖ్యంగా యువ బ్యాటర్ ప్రియాన్ష్ ఆర్య (11 బంతుల్లో 29) ఆరంభం నుంచే బాదుడు మొదలుపెట్టాడు. ఐదు ఫోర్లు, ఒక సిక్సర్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఆర్య ఔటైనప్పటికీ, పవర్‌ప్లే ముగిసేసరికి పంజాబ్ వికెట్ నష్టానికి 65 పరుగులు చేసి బలమైన పునాది వేసుకుంది. మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (44 బంతుల్లో 59) ఒక ఎండ్‌లో నిలకడగా ఆడుతూ కీలక అర్ధ శతకాన్ని నమోదు చేశాడు. అతనికి కూపర్ కనోలీ (14 బంతుల్లో 30) కూడా తోడవడంతో పంజాబ్ స్కోరు వేగంగా ముందుకు సాగింది. అయితే, కనోలీ, ప్రభ్‌సిమ్రన్ వరుస ఓవర్లలో ఔటవ్వడంతో పంజాబ్ స్కోరు వేగం కాస్త మందగించినట్టు అనిపించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (27 బంతుల్లో 30) నెమ్మదిగా ఆడినా, వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన మార్కస్ స్టోయినిస్ మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. రాజస్థాన్ బౌలర్లపై కనికరం లేకుండా విరుచుకుపడ్డాడు. కేవలం 22 బంతుల్లోనే 4 ఫోర్లు, 6 సిక్సర్లతో అజేయంగా 62 పరుగులు చేసి ఆఖరి ఓవర్లలో స్కోరును అమాంతం పెంచేశాడు. అతని విధ్వంసంతో పంజాబ్ సునాయాసంగా 220 పరుగుల మార్కును దాటింది. రాజస్థాన్ బౌలర్లలో యశ్ రాజ్ పుంజా రెండు వికెట్లు పడగొట్టినా, ధారాళంగా పరుగులు సమర్పించుకున్నాడు. నాంద్రే బర్గర్ 4 ఓవర్లలో ఏకంగా 59 పరుగులు ఇచ్చాడు. జోఫ్రా ఆర్చర్ ఒక వికెట్ తీశాడు. ఒక్క రవీంద్ర జడేజా (4 ఓవర్లలో 32) మాత్రమే కాస్త పొదుపుగా బౌలింగ్ చేశాడు. మొత్తంగా, పంజాబ్ బ్యాటర్ల ధాటికి రాజస్థాన్ బౌలర్లు తేలిపోయారు. ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించాలంటే రాజస్థాన్ బ్యాటర్లు అసాధారణ ప్రదర్శన చేయాల్సి ఉంటుంది.




## ఎదురులేని పంజాబ్ కింగ్స్‌తో రాజస్థాన్ రాయల్స్ ఢీ... టాస్ గెలిచిన రియాన్ పరాగ్

పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో టాస్ గెలిచిన రాజస్థాన్ రాయల్స్

మొదట బౌలింగ్ చేయాలని నిర్ణయించుకున్న కెప్టెన్ రియాన్ పరాగ్

పిచ్‌పై ఉన్న తేమను ఉపయోగించుకుంటామన్న రాజస్థాన్ కెప్టెన్

తాము కూడా బౌలింగ్ చేయాలనే అనుకున్నామన్న శ్రేయస్ అయ్యర్




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026లో భాగంగా పంజాబ్ కింగ్స్‌తో జరుగుతున్న 40వ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. మొహాలీలోని ముల్లన్‌పూర్ క్రికెట్ స్టేడియం ఈ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇస్తోంది. ఈ సీజన్‌లో అద్భుత ఫామ్‌తో అగ్రస్థానంలో ఉన్న పంజాబ్‌ను నిలువరించేందుకు రాజస్థాన్ బరిలోకి దిగింది. టాస్ గెలిచిన అనంతరం రాజస్థాన్ కెప్టెన్ రియాన్ పరాగ్ మాట్లాడుతూ, "మేము మొదట బౌలింగ్ చేస్తాం. వర్షం, మేఘావృత వాతావరణం కారణంగా పిచ్‌పై కొద్దిగా తేమ ఉంది. దాన్ని సద్వినియోగం చేసుకొని ఆరంభంలోనే వికెట్లు తీయాలని భావిస్తున్నాం" అని తెలిపాడు. పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ, "వాతావరణం కారణంగా మేం కూడా బౌలింగ్ చేయాలనే అనుకున్నాం. కానీ బ్యాటింగ్ అయినా, బౌలింగ్ అయినా అదొక సవాలే. దానికి మేం సిద్ధంగా ఉన్నాం" అని పేర్కొన్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు పంజాబ్ కింగ్స్ ఆడిన 7 మ్యాచ్‌లలో 6 విజయాలు సాధించగా, ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. దీంతో పాయింట్ల పట్టికలో ఆ జట్టు అగ్రస్థానంలో కొనసాగుతోంది. మరోవైపు రాజస్థాన్ రాయల్స్ 8 మ్యాచ్‌లలో 5 విజయాలతో నాలుగో స్థానంలో ఉంది.

జట్ల వివరాలు:

పంజాబ్ కింగ్స్: ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), ప్రియాంశ్ ఆర్య, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), కూపర్ కనోలీ, సూర్యాంశ్ షెడ్గే, నేహాల్ వధేరా, మార్కస్ స్టొయినిస్, మార్కో యాన్సెన్, లాకీ ఫెర్గూసన్, అర్ష్‌దీప్ సింగ్, యుజువేంద్ర చాహల్.

రాజస్థాన్ రాయల్స్: వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రియాన్ పరాగ్ (కెప్టెన్), డొనోవాన్ ఫెరీరా, రవీంద్ర జడేజా, దసున్ షనక, జోఫ్రా ఆర్చర్, నాంద్రే బర్గర్, బ్రిజేష్ శర్మ, యశ్ రాజ్ పంజా.

ఇంపాక్ట్ సబ్స్:

రాజస్థాన్ రాయల్స్: రవి బిష్ణోయ్, రవి సింగ్, తుషార్ దేశ్‌పాండే, శుభమ్ దూబే, షిమ్రాన్ హెట్‌మెయర్.

పంజాబ్ కింగ్స్: విష్ణు వినోద్, విజయ్‌కుమార్ వైశాఖ్, జేవియర్ బార్ట్‌లెట్, హర్‌ప్రీత్ బ్రార్, ముషీర్ ఖాన్.

## మరోసారి వినేశ్ ఫోగాట్ - రెజ్లింగ్ ఫెడరేషన్ మధ్య రచ్చ

నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంటులో పాల్గొనేందుకు సిద్ధమైన వినేశ్ ఫోగాట్

రిజిస్ట్రేషన్ పోర్టల్ మూసివేసినట్టు చూపిస్తోందన్న వినేశ్ ఫోగాట్ ఆరోపణలను ఖండించిన రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు

భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ పునరాగమనం విషయంలో తలెత్తిన వివాదం క్రీడా రంగంలో చర్చనీయాంశంగా మారింది. పారిస్ ఒలింపిక్స్ తర్వాత రిటైర్మెంట్ ప్రకటించి, ఆ తర్వాత తన నిర్ణయాన్ని మార్చుకున్న వినేశ్, వచ్చే నెలలో జరగనున్న నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు సిద్ధమైంది. అయితే ఈ టోర్నమెంట్ రిజిస్ట్రేషన్ కోసం ఏప్రిల్ 30 వరకు గడువు ఉన్నప్పటికీ, ఆన్‌లైన్ పోర్టల్ ముందే మూసివేసినట్లు చూపిస్తోందని ఆమె ఆరోపించారు. దీనిపై రెజ్లింగ్ ఫెడరేషన్ అధికారులకు ఫోన్ చేసినా, మెసేజ్‌లు పంపినా ఎవరూ స్పందించడం లేదని, కావాలనే తనను పోటీలకు దూరం చేసేందుకు కుట్ర జరుగుతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలు, ప్రపంచ ఛాంపియన్‌షిప్ ట్రయల్స్‌కు అర్హత సాధించాలంటే ఈ టోర్నమెంట్ ఆమెకు ఎంతో కీలకం. మరోవైపు, వినేశ్ చేసిన ఆరోపణలను రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సంజయ్ సింగ్ ఖండించారు. వినేశ్ రిజిస్ట్రేషన్ ఇప్పటికే పూర్తయిందని, దానికి సంబంధించిన ఆధారాలు కూడా తమ వద్ద ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ సమయంలో తలెత్తిన సాంకేతిక సమస్యలను ఇతర రెజ్లర్లు అధికారులను సంప్రదించి పరిష్కరించుకున్నారని... కానీ వినేశ్ మాత్రం నేరుగా మీడియా ముందుకు వెళ్లి అనవసరపు వివాదాలు సృష్టిస్తున్నారని ఆయన విమర్శించారు. క్రీడాకారులు ఇలాంటి విషయాలపై రాద్ధాంతం చేయకుండా ఆటపై దృష్టి సారించాలని ఆయన సూచించారు.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# ఫ్యాన్స్‌తో కలిసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్న సమంత



**నేడు సమంత పుట్టినరోజు**

**చాలా ఏళ్ల తర్వాత ఫ్యాన్స్‌తో కలిసి కేక్ కట్ చేసిన స్టార్ హీరోయిన్**

**రాజ్ నిడిమోరుతో పెళ్లి తర్వాత సమంతకు ఇది తొలి పుట్టినరోజు**

**నయనతార, వరలక్ష్మి వంటి తారల నుంచి శుభాకాంక్షలు**

**మే 15న 'మా ఇంటి బంగారం' విడుదల**



స్టార్ హీరోయిన్ సమంత తన పుట్టినరోజును అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ వేడుకలో ఆమె ఫ్యాన్స్‌తో కలిసి కేక్ కట్ చేశారు. దర్శకుడు రాజ్ నిడిమోరుతో వివాహం తర్వాత ఆమెకు ఇది తొలి పుట్టినరోజు కావడం విశేషం. చాలా కాలం తర్వాత సమంత తన అభిమానులతో నేరుగా సమయం గడపడం ఈ వేడుకకు ప్రత్యేకతను తెచ్చిపెట్టింది. అభిమానుల మధ్య ఎంతో ఆనందంగా కనిపించిన సమంత, వారితో సరదాగా మాట్లాడుతూ ఫొటోలకు పోజులిచ్చారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. తన వ్యక్తిగత జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమైన తర్వాత అభిమానులతో ఇలా మమేకం కావడం పట్ల ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సమంతకు సినీ పరిశ్రమ నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. నయనతార తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో "పుట్టినరోజు శుభాకాంక్షలు స్వీటెస్ట్ గర్ల్" అని పేర్కొనగా, నటి వరలక్ష్మి శరత్‌కుమార్ "నువ్వు ఎప్పటికీ మా ఇంటి బంగారం" అంటూ ప్రేమగా విష్ చేశారు. కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్ వంటి పలువురు తారలు ఆమెకు విషెస్ తెలిపారు. ఇదే సమయంలో సమంత నటిస్తూ, నిర్మిస్తున్న 'మా ఇంటి బంగారం' చిత్రం మరోసారి వార్తల్లో నిలిచింది. 'ఓ బేబీ' తర్వాత నందిని రెడ్డి దర్శకత్వంలో వస్తున్న ఈ ఫ్యామిలీ యాక్షన్ కామెడీ చిత్రానికి రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా మే 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# హైకోర్టును ఆశ్రయించిన అషు రెడ్డి.. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ పిటిషన్

**ధర్మేంద్ర తనపై చేసిన ఆరోపణల్లో నిజం లేదన్న అషు రెడ్డి**

**పోలీసులు ఏకపక్షంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారని ఆవేదన**

**తప్పుడు ప్రచారం చేస్తూ తన వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్నారన్న అషు**

హనీ ట్రాప్, చీటింగ్ కేసులో సినీ నటి అషు రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ ఆమె క్వాష్ పిటిషన్ వేశారు. లండన్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ధర్మేంద్ర తనపై చేసిన ఆరోపణల్లో నిజం లేదని, తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ఆమె తన పిటిషన్ లో పేర్కొన్నారు. పోలీసులు కనీసం తన వివరణ తీసుకోకుండానే, కేవలం ధర్మేంద్ర తండ్రి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఏకపక్షంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారని అషు రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం ప్రచారం చేస్తూ తన వ్యక్తిత్వ హననం చేస్తున్నారని, వాస్తవాలను దాచిపెట్టి ఈ కేసు పెట్టారని ఆమె అన్నారు. మరోవైపు, 2018 నుంచి పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. సుమారు రూ. 9.35 కోట్ల డబ్బు, 5 కిలోల బంగారం, విలాసవంతమైన కార్లు, ఫ్లాట్లు వసూలు చేసిందని ధర్మేంద్ర





# విలేకరి ప్రశ్నతో కన్నీటి పర్యంతమైన పాయల్ రాజ్ పుత్..

**విలేకరి అడిగిన ప్రశ్నకు తీవ్ర భావోద్వేగానికి లోనైన పాయల్**

**తండ్రిని గుర్తుచేసుకుని వేదికపైనే కన్నీళ్లు పెట్టుకున్న నటి**

**ఆయనే నా రియల్ హీరో అంటూ తండ్రి గురించి వ్యాఖ్యలు**

**డిప్రెషన్‌లోకి వెళ్లి చికిత్స తీసుకున్నట్లు వెల్లడి**

**'ఫస్ట్ టైం' సినిమా ఈవెంట్‌లో ఈ ఘటన**

'ఆర్ఎక్స్ 100' ఫేమ్ పాయల్ రాజ్‌పుత్ ఓ సినిమా కార్యక్రమంలో కన్నీటిపర్యంతమయ్యారు. సాధారణంగా ఎంతో చలాకీగా, నవ్వుతూ కనిపించే ఆమె, ఓ విలేకరి అడిగిన వ్యక్తిగత ప్రశ్నకు తన భావోద్వేగాన్ని ఆపుకోలేకపోయారు. తండ్రిని గుర్తుచేసుకుని వేదికపైనే ఏడుస్తూ, ప్రెస్ మీట్ మధ్యలోనే వెళ్లిపోయారు. ఈ ఘటన పలువురిని కదిలించింది. వివరాల్లోకి వెళ్తే, సౌరభ్ ధింగ్రా హీరోగా నటిస్తున్న 'ఫస్ట్ టైం (01-01-01)' సినిమా ప్రమోషనల్ ఈవెంట్‌కు పాయల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ఓ ప్రశ్నకు బదులిస్తూ ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. ఇటీవల ఎదుర్కొన్న కష్టాల గురించి, ముఖ్యంగా తన తండ్రి గురించి ప్రస్తావన రావడంతో ఆమె కన్నీళ్లు ఆపుకోలేకపోయారు. "నా రియల్ హీరో మా నాన్నే. వచ్చే నెలతో ఆయన చనిపోయి సంవత్సరం అవుతుంది," అంటూ కన్నీళ్లతో చెప్పారు. గతేడాది తన తండ్రి విమల్ కుమార్ రాజ్‌పుత్ క్యాన్సర్‌తో మరణించారని పాయల్ తెలిపారు. ఆయన మరణం తర్వాత తాను తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్లానని, దాని నుంచి బయటపడేందుకు చికిత్స కూడా తీసుకున్నానని వెల్లడించారు. తన తండ్రి తన సినిమాలను ఎంతో ఇష్టంగా చూసేవారని, బోల్డ్ సినిమా అయినప్పటికీ 'ఆర్ఎక్స్ 100'లో తన నటనను మెచ్చుకున్నారని గుర్తుచేసుకున్నారు. పక్కనే ఉన్న వారు ఓదార్చే ప్రయత్నం చేసినా, పాయల్ తన దుఃఖాన్ని అదుపు చేసుకోలేక వేదిక నుంచి కిందకు వెళ్లిపోయారు. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com